ఉద్యోగుల్లో అలజడి





సమగ్ర శిక్ష (ఎస్ఎస్ఏ) పరిధిలోని కేజీబీవీలు, ఎమ్మార్సీల్లో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తాజా ఉత్తర్వులు ప్రకారం.. రిక్వెస్ట్, మ్యూచువల్ బదిలీలకు మాత్రమే అవకాశం ఇచ్చారు. దీంతో వందల సంఖ్యలో ఉద్యోగులు బదిలీ అయ్యే అవకాశం ఉన్నట్లు ఆ శాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. గతంలో జరిగిన బదిలీలో కొందరు అప్పట్లో పైరవీలు చేసి సమీప ప్రాంతాల్లో పోస్టింగ్‌లు పొం దారని.. తాజా నిబంధనలతో వారందరూ ఇప్పుడున్న స్థానాల నుంచి కదిలే అవకాశం లేదని తెలుస్తోంది. దర్జాగా గతంలో సిఫార్సులతో పొందిన వారే.. యథావిధిగా అక్కడే కొనసాగుతారనే.. ప్రచారం ఆ శాఖలో జరుగుతోంది. కొద్ది మంది ఉద్యోగులు మాత్రమే తాజా నిబంధనతో బదిలీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కలెక్టర్‌తో పాటు ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ ఆధ్వర్యంలో బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ జరగనుంది. తాజా బదిలీ ఉత్తర్వులతో ఈ ఉద్యోగుల్లో బదిలీ టెన్షన్ మొదలైంది.

- సమగ్ర శిక్షలో బదిలీలకు గ్రీన్‌సిగ్నల్
- రిక్వెస్ట్.. మ్యూచువల్ బదిలీలకు అనుమతి
- పోస్టింగ్‌ల కోసం పైరవీలు
- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

నంద్యాల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జిల్లా సమగ్ర శిక్ష (ఎస్ఎస్ఏ) పరిధిలోని కేజీబీవీలు, ఎమ్మార్సీల్లో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈమేరకు ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఆయా ఉద్యోగుల్లో బదిలీ అలజడి మొదలైంది. ఆయా కేజీబీవీలు, ఎమ్మార్సీల్లో సుమారు 800 మంది ఉద్యోగులు పనిచేస్తుండటంతో తాజా ఉత్తర్వులు ప్రకారం.. కేవలం రిక్వెస్ట్.. మ్యూచువల్ బదిలీలకు మాత్రమే అవకాశం ఇవ్వడంతో వందల సంఖ్యలో ఉద్యోగులు బదిలీ అయ్యే అవకాశం ఉన్నట్లు ఆశాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ రెండు రకాలు బదిలీలకు మాత్రమే నిబంధన పెట్టడంతో ఏళ్లతరబడి ఒకే ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు బదిలీ చేసుకుంటారా..? లేక.. ఆయా ప్రాంతాల్లోనే యథా విధి గా కొనసాగుతారా..? అనే ఉత్కంఠ రేపుతోంది. ఏది ఏమైనా ఆయా ఉద్యోగుల ఉత్కంఠ వీడాలంటే.. జూలై 5వ తేదీ వరకు ఆగాల్సిందే అన్నట్లుగా పరిస్థితి జిల్లాలో నెలకొంది.

ఆ రెండింటికి మాత్రమే..

ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం.. మిగిలిన శాఖలకు ఇచ్చిన నిబంధనతో ఏమాత్రం సంబంధం లేకుండా ప్రభుత్వం ఎస్ఎస్ఏలో పనిచేస్తున్న ఉద్యోగులకు రిక్వెస్ట్.. మ్యూచువల్‌కు మాత్రమే బదిలీ తప్పనిసరి చేసింది. దీంతో ఆశించిన స్థాయిలో ఉద్యోగులు బదిలీ అయ్యే అవకాశం లేదని తెలుస్తోంది. గతంలో జరిగిన బదిలీల్లో కొందరు అప్పట్లో పైరవీలు చేసి ఆయా వారి సమీప ప్రాంతాల్లో పోస్టింగ్‌లు పొందారని.. తాజా నిబంధనలతో వారందరూ ఆయా స్థానాల నుంచి కదిలే అవకాశం లేదని విషయం తెలుస్తోంది. దీని వల్ల ఇంతకుముందు సిఫార్సులతో సీటును అంటిపెట్టుకున్నవారే ఇప్పుడూ లాభపడే అవకాశం ఉందనే విమర్శలు ఉన్నాయి. కొద్ది మంది ఉద్యోగులకు ఎక్కడైనా బదిలీ కావచ్చుగాని, మెజారిటీ ఉద్యోగులు ఏళ్ల తరబడి ఉన్న సీట్లనే అంటిపెట్టుకొని ఉండే అవకాశం ఉంది.

నెలాఖరుకు బదిలీల ప్రక్రియ..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. ఆయా ఉద్యోగులు రెండు కేటగిరీల కింద ఔత్సాహికులైన ఉద్యోగులు ఎవరైనా తమ దరఖాస్తులను ఈనెల 19వ తేదీ నుంచి (గురువారం) ఆశాఖ జిల్లా కార్యాలయంలో అందజేయాల్సి ఉంది. వచ్చిన దరఖాస్తుల పరంగా ఈ నెలాఖరుకు బదిలీ పక్రియ పూర్తిచేయనున్నారు. లేకపోతే.. వచ్చే జూలై 5లోపు బదిలీ పక్రియ పూర్తికానుంది. ఇదిలా ఉండగా.. ఆయా బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ కలెక్టర్‌తో పాటు ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ ఆధ్వర్యంలో జరగనుంది. వివిధరకాల అంగవైకల్యం, అనారోగ్యం కలిగిన ఉద్యోగు లకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు సమాచారం. మొత్తంగా తాజా బదిలీ ఉత్తర్వులతో ఆయా ఉద్యోగుల్లో బదిలీ టెన్షన్ మొదలైంది.

పైరవీలు మొదలెట్టారు..

గతంలో జరిగిన అన్యాయాలను దృష్టిలో పెట్టుకుని కొందరు ఉద్యోగులు తాజా బదిలీల్లోనైనా తమకు న్యాయం జరిగే విధంగా ఎవరిస్థాయిలో వారు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. ఇదేక్రమంలో ఏళ్లతరబడి తిష్ట వేసిన ఉద్యోగులు సైతం తమ పోస్టింగ్‌ల్లోకి ఎవరిని రానీవ్వకుండా తమదైన శైలిలో పైరవీలు మొదలెట్టినట్లు ఆశాఖ ఉద్యోగుల ద్వారా తెలిసింది. మరికొందరైతే ఏలాగైనా తాము కోరుకున్నచోటకు పోస్టింగ్ తెచ్చుకోవాలనే విధంగా ప్రజాప్రతినిధుల వద్ద తెర వెనుక రాజకీయం చేస్తున్నారనే ప్రచారం లేకపోలేదు. ఏది ఏమైనా ఎస్ఎస్ఏ ఉద్యోగులకు సైతం ప్రభుత్వం ఈ రెండు కేటగిరీల కింద బదిలీలకు అవకాశం కల్పించడంతో ఆశాఖ వర్గాల్లో బదిలీ అలజడి రేపినట్లైంది.

బలవంతపు బదిలీలు ఉండవు



తాజా బదిలీ నిబంధనల ప్రకారం ఉద్యోగులు ఎవర్నీ కూడా బలవంతంగా బదిలీ చేయడం జరగదు. ఆయా బదిలీలకు వచ్చిన దరఖాస్తుల పరంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తాం. ఎలాంటి ఒత్తిళ్లు ఉండవు. అర్హులైన వారందరికి న్యాయంగా బదిలీ చేస్తాం

-ప్రేమంత్‌కుమార్, ఏపీసీ, ఎస్ఎస్ఏ

పాతుకుపోయారు..

రెవెన్యూ కార్యాలయమే వారి అడ్డా

- రెవెన్యూ ఉద్యోగుల బదిలీల్లో పైరవీలు
- అదేస్థానంలో కొనసాగింపు
- డిప్యుటేషన్ కోసం జాయింట్ కలెక్టర్‌కు ఫైలు
- బదిలీ అయిన ఉద్యోగులను రిలీవ్ చేయని రెవెన్యూ అధికారులు
- గాడి తప్పిన రెవెన్యూ శాఖ



జిల్లా కలెక్టర్ కార్యాలయం

పాలనాపరంగా రెవెన్యూ శాఖ అత్యంత కీలకమైనది. డీఆర్వో కార్యాలయంలో కొందరు ఉద్యోగులు కొన్నేళ్లుగా పాతుకుపోయారు. వారు రెవెన్యూ శాఖ విధులకు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపణలున్నాయి. రెవెన్యూ సెక్షన్‌లో జరిగే బదిలీలు, పదోన్నతులు వంటి అంశాలను కింది స్థాయి ఉద్యోగులకు చేరవేసి అవరోధంగా తయారవుతున్నారు. ఇటీవల రెవెన్యూ ఉద్యోగుల బదిలీలు జరిగాయి. ఈ బదిలీల్లో డీఆర్వో కార్యాలయంలో కొందరు ఉద్యోగులు పైరవీలు చేశారన్న విమర్శలున్నాయి. ఐదేళ్లు దాటిన వారికి తప్పనిసరిగా బదిలీ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ప్రభుత్వ ఉత్తర్వులను తుంగలో తొక్కి మరలా అదే సెక్షన్‌లో అదే స్థానం లేదంటే మరొక సెక్షన్‌లో స్థానాన్ని ఉన్నతాధికారులు కేటాయించారు. కొందరిని డిప్యుటేషన్‌పై కొనసాగించడానికి మరలా జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఫైల్ పెట్టడం కొసమెరుపు. దీంతో పాలన గాడితప్పిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మిగతా 6వ పేజీలో

న్యూస్ బాక్స్

డీఎస్సీ పరీక్షలకు 38 మంది గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో ఐదు పరీక్షా కేంద్రాల్లో బుధవారం రెండు సెషన్స్‌లో నిర్వహించిన మెగా డీఎస్సీ పరీక్షలకు 38మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొదటి సెషన్‌లో పీజీటీ కామర్స్ పరీక్షకు మొత్తం 897 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 880 మంది అభ్యర్థులు హాజరై 17మంది గైర్హాజర య్యారు. రెండో సెషన్‌లో ఎస్టీటీ పరీక్ష నిర్వహించగా 895 మంది అభ్యర్థులకు గాను 874 మంది అభ్యర్థులు హాజరుకాగా 21 మంది గైర్హాజరైనట్లు డీఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు.

పీజీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ(ఆర్‌యూ)లో గడిచిన జనవరిలో జరిగిన పీజీ మూడో సెమిస్టర్ ఫలితాలను ఉపకులపతి వి. వెంకట బసరావు బుధవారం విడుదల చేశారు. రెగ్యులర్ విభాగంలో 264మంది విద్యార్థులకుగాను 248 మంది, అనుబంధ కళాశాలల్లో 147 మంది విద్యార్థులకు 134 మంది, సప్లమెంటరీ విభాగంలో 11 మందికి ఏడుగురు, అనుబంధ కళాశాలల్లో 54మందికి 32 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు. మరిన్ని వివరాలకు సంబంధించి వర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎయిర్‌పోర్టు అభివృద్ధికి రూ.8.033 కోట్లు : మంత్రి బీసీ



బనగానపల్లె, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ఎయిర్‌పోర్టు అభివృద్ధి కోసం రూ. 8.033 కోట్లకు అనుమతి లభించిందని రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక వనరుల శాఖమంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కర్నూలు ఎయిర్‌పోర్టులో 2 అభివృద్ధి పనులకు 2025-26 సంవత్సరానికి విమానాశ్రయం కార్యకలాపాల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. రన్‌వేస్ అండ్ సేఫ్టీని సరిదిద్దడానికి ఇతర నిర్వహణ పనులకు రూ.3.6 కోట్లు, కర్నూలు ఎయిర్‌పోర్టులో టాక్సీవేటు ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ అందించడానికి రూ.4.433 కోట్లకు అనుమతి లభించాయన్నారు. త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

లంచం.. లాంఛనం...!





- మద్యం షాపుల్లో మామూళ్ల దందా
- ఒక్కో దుకాణం నుంచి నెలకు రూ.1.25 లక్షలకు పైగా ఇవ్వాల్సిందే

- ప్రజాప్రతినిధులు, ఎక్సైజ్, పోలీసు అధికారులకు వాటాలు?
- నెలకు రూ.కోటికి పైగా చేతులు మారుతున్న వైనం
- మామూళ్ల మత్తులో కళ్లకు గంతలు కట్టుకున్న నిఘా యంత్రాంగం

మద్యం వ్యాపారంలో లంచం.. లాంఛనంగా మారింది. చట్ట విరుద్ధంగా జరిగే పని నేరంగా కాక ఆనవాయితీగా మారిపోయింది. నిబంధనలను తుంగల్లో తొక్కడం వల్లే మద్యం వ్యాపారం అత్యంత లాభసాటి అయింది. ఇట్లా వ్యాపారం చేయాలంటే నెల నెలా మామూళ్లు సమర్పించుకోవాల్సిందే. దీంతో లంచాలు ఇచ్చే వాళ్లకు తప్పనిసరి అయింది. తీసుకొనేవాళ్లు హక్కుగా భావించే పరిస్థితి వచ్చింది. కాదు.. కూడదంటే అధికారులకు నిబంధనలు గుర్తుకొస్తాయి. కేసులు నమోదు చేస్తారు. ఇంకా దూరంపోయి లైసెన్స్ రద్దు చేస్తామంటారు. ఒక్కో మద్యం దుకాణం నుంచి రూ.లక్ష నుంచి రూ.1.25 లక్షల చొప్పున అంటే.. నెలకు రూ.కోటికిపైగా చేతులు మారుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇందులో నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, కొందరు ఎక్సైజ్, పోలీసు అధికారులకు వాటాలు అందుతున్నాయనే విమర్శలు ఉన్నాయి.

కర్నూలు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పర్యవేక్షణ ఉన్న ఏడు స్టేషన్ల పరిధిలో 110 మద్యం షాపులు, 23 బార్లు ఉన్నాయి. వైసీపీ హయాంలో నూతన మద్యం పాలసీ పేరిట ప్రభుత్వమే మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి మద్యం అమ్మకాలు చేసింది. సంపూర్ణ మద్య నిషేధం 2019 ఎన్నికల్లో వైసీపీ హామీ. కానీ అధికారంలోకి వచ్చాక జగన్ మాట మార్చారు. ధరలు పెంచితే మద్యం మానేస్తారని మద్య నిషేధానికి కొత్త నిర్వచనం చెప్పి ఇష్టారాజ్యంగా ధరలు పెంచేశారు. ప్రముఖ బ్రాండ్ల మద్యం సరఫరా ఆపేసి.. ఇచ్చింది తాగండి..! అన్నట్లు మునుపెన్నడు చూడని బ్రాండ్లను ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అమ్మకాలకు పెట్టారు. దీనిపై మద్యం ప్రియుల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం అమ్మకాల పాలసీని రద్దు చేసింది. లాటరీ ద్వారా మద్యం దుకాణాలు లైసెన్స్ విధానం అమలులోకి తెచ్చింది. ప్రైవేటు వ్యాపారులకు అప్పగించారు. అంతేకాదు.. ప్రముఖ బ్రాండ్లు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ధరలు కూడా తగ్గించారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన అనుమతి లేని మద్యం, నాటు సారాను నియంత్రించాలనే లక్ష్యంగా రూ.99కే క్వాటర్ నాణ్యమైన లిక్కర్‌ను తీసుకొచ్చారు. ఫలితంగా గత ప్రభుత్వ హయాంలో నెలకు సగటున రూ.65-70 కోట్ల మద్యం అమ్మకాలు జరిగితే.. ప్రస్తుతం రూ.95-105 కోట్లకు పైగా విక్రయాలు జరుగుతున్నాయని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు పేర్కొంటున్నారు. అదే స్థాయిలో నెల మామూళ్లు కూడా పెంచేశారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

రాజకీయ నేతలకు రూ.కోటికి పైగా వాటాలు?

రాజకీయ ప్రముఖ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఎక్సైజ్, పోలీసు అధికారులకు మద్యం ఆదాయ వనరుగా మారింది. మద్యం అమ్మకాలు జరిగేదీ లేనిదీ మీరు చూసుకోవాల్సిందే..! మాకు మాత్రం నెలనెలా మామూళ్లు ఇవ్వాలందే అన్నట్లుగా కొందరు అధికారులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఎక్సైజ్ అధికారులు కొందరు మామూళ్లు వసులు చేసే ఏజెంట్లుగా మారారనే ఆరోపణలు ఉన్నాయి. మద్యం అమ్మకాలను బట్టి ఒక్కో దుకాణం నుంచి నెలనెలా రూ.లక్ష నుంచి రూ.1.25 లక్షలకు పైగా మామూళ్ల కింద ఇచ్చుకోవాల్సి వస్తుందనే ఆరోపణలు ఉన్నాయి. ఇంత జరిగినా మామూళ్లు ముట్టజెప్పడం, తీసుకోవడం లాంఛనంగా మారిందనే విమర్శలు ఉన్నాయి. నియోజకవర్గానికి చెందిన ముఖ్య ప్రజాప్రతినిధికి రూ.45-50 వేలు, కొందరు ఎక్సైజ్ అధికారులకు రూ.45 వేలు, సంబంధిత పోలీస్ స్టేషన్‌కు రూ16-20 వేల వరకు వస్తుందని పేరు బయటకు చెప్పుకోలేని ఓ మద్యం వ్యాపారి వాపోయాడంటే ఏ స్థాయిలో అవినీతి పేరుకుపోయిందో తెలుస్తున్నది.

మిగతా 7వ పేజీలో

బదిలీల అర్హుల జాబితా దిద్దుబాటు



నంద్యాల జీజీహెచ్

నంద్యాల హాస్పిటల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్యశాఖ బదిలీల అర్హుల జాబితాలో జరిగిన అవకతవకలపై ఆ శాఖ ఉన్నతాధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. అర్హుల జాబితాలో పదిమంది నర్సుల పేర్లు లేకపోవడంతో ఈ విషయాన్ని 'వైద్య ఆరోగ్యశాఖలో బదిలీలలు' అనే శీర్షికతో ఈ నెల 14న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురించింది. 14ఏళ్ల సీనియారిటీ ఉన్న నర్సులను బదిలీల అర్హుల జాబితాలో చేర్చకపోవడంతో మిగిలిన నర్సులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కడప ఆర్డీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో 2011 నుంచి ఉద్యోగం చేస్తున్న 8 మంది స్టాఫ్‌నర్సులు, 2016 నుంచి పనిచేస్తున్న ఇద్దరు స్టాఫ్ నర్సులను బదిలీల అర్హుల జాబితాలో చేర్చి కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సీఈవో చేతివాటం

- నాగంపల్లి సొసైటీలో నిధులు గోల్‌మాల్
- సుమారు రూ.50 లక్షలకు పైగా స్వాహా...?
- సీఈవోను సస్పెండ్ చేసిన అధికారులు



కొత్తపల్లిలోని నాగంపల్లి సొసైటీ బ్యాంకు ఇదే

కొత్తపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నాగంపల్లి సొసైటీలో 2022 నుంచి సీఈవోగా విధులు నిర్వహిస్తున్న కోటేశ్వరయ్య కొంతకాలంగా రైతులు చెల్లించిన బకాయిలను బ్యాంకులో జమ చేసుకోకుండా చేతివాటం ప్రదర్శించినట్లు తెలుస్తుంది. సుమారు రూ.50లక్షలకు పైగా బ్యాంకు నిధులు స్వాహాచేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈసొసైటీలో నిధులు గోల్‌మాల్ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసినట్లు ఆత్మకూరు సొసైటీ బ్యాంకు మేనేజర్ మహ్మద్‌రసూల్ తెలిపారు. వివరాలు.. నాగంపల్లి సొసైటీలో సీఈవోగా విధులు నిర్వహిస్తున్న కోటేశ్వరయ్య ఈఏడాది మార్చి నుంచి విధులకు సక్రమంగా హాజ రు కావడం లేదు. అతడిపై అనుమానం రావడంతో కర్నూలు బ్రాంచ్ మేనేజర్‌కు ఈ నెల 10వ తేదీ పిర్యాదు చేశాం. ఈ మేరకు నంద్యాల సొసైటీ చీఫ్ మేనేజర్ సౌజన్యదీప్తితో పాటు తాను విచారణ చేపట్టామన్నారు. ఈ విచారణలో రైతులు బ్యాంకుకు చెల్లించాల్సిన నగదును బ్యాంకులో జమ చేయకుండా తన సొంతానికి రూ.10లక్షల మేర వాడుకున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఆ నగదును సదరు సీఈవో నుంచి రికవరీ చేసి ఈ నెల 12న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోటేశ్వరయ్యను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. ఇంకా పూర్తిస్థాయిలో సీఈవోపై విచారణ చేస్తున్నామని, భారీ ఎత్తున బ్యాంకు నిధులు గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలు కూడా వస్తున్నాయని చెప్పారు. విచారణ పూర్తయిన వెంటనే తుది నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని రసూల్ తెలిపారు.

20న స్విమ్మింగ్ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఒలింపిక్ డే సంబరాల సందర్భంగా ఈ నెల 20న నగరంలోని ఓల్డ్ రఘునాథ్ టాకీస్ వద్ద ఉండే స్విమ్మింగ్ పూల్‌లో అం డర్-18 విభాగంలో స్విమ్మింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మాస్టర్ స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రతినిధి జేఎల్ఎన్ రెడ్డి ఆధ్వర్యంలో 18 సంవత్సరాల లోపు క్రీడాకారులకు పలు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమాచారం కోసం సెల్.నెం.9440251668ను సంప్రదించాలని కోరారు. విజేతలకు మెడల్స్ ప్రతిభ, ప్రశంసాపత్రాలు అందజేస్తామని వివరించారు.

డేటా ఎంట్రీపై ఉచిత శిక్షణ

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 26 నుంచి డేటా ఎంట్రీపై ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆకళాశాల ప్రిన్సిపాల్ శశికళ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డొమెస్టిక్ డాటా ఎంట్రీ కోర్సుకు ఇంటర్, ఆపై చదివినవారు, పైథాన్‌కు డిగ్రీ, బీటెక్ కంప్యూటర్ చదివినవారు అర్హులని పేర్కొ న్నారు. కోర్సు పూర్తిచేసిన వారికి రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపుతో కూడిన సర్టిఫికెట్ ఇసా ్తమని, శిక్షణ అనంతరం ఆయా కంపెనీలతో ఉద్యోగాలు కల్పిస్తారని వివరించారు. అర్హులైన యువతీ యువకులు స్కిల్‌డెవలప్‌మెంట్ వెబ్‌సైట్ ద్వారా రిజిస్టర్ చేసుకో వాలని, శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులు వారి విద్యార్హత పత్రాలు, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలతో హాజరుకావాలని కోరారు.

మహానందిలో ఆర్‌అండ్‌బీ సీఈ పూజలు



వేదపండితుల ఆశీర్వాదం పొందుతున్న ఆర్‌అండ్‌బీ సీఈ వెంకటేశ్వరరావు

మహానంది, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో బుధవారం ఆర్‌అండ్‌బీ సీఈ వెంకటేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ముఖద్వారం వద్ద అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో సీఈ మహానందీశ్వరుడికి, కామేశ్వరీదేవి అమ్మవారికి అభిషేకార్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని అలంకార మండపంలో వీరిని వేదపండితులు ఆశీర్వదించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పసుపుల సుబ్బారెడ్డి శాలువాతో సన్మానించారు వీరివెంట నం ద్యాల జిల్లా ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, కడప జిల్లా ఈఈ కృష్ణారెడ్డి ఉన్నారు.

రైతులే ధర నిర్ణయించేలా ఎదగాలి

- 964 మంది రైతులకు రూ.1.99 కోట్ల రాయితీ
- వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీ చేసిన కలెక్టర్



రైతులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పండించిన పంటకు ధర నిర్ణయించే స్థాయికి రైతులు ఎదగాలని నంద్యాల కలెక్టర్ రాజకుమారి ఆకాంక్షించారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద జిల్లాలో 964మంది చిన్న, సన్నకారు రైతులకు రూ.1.99 కోట్ల వ్యవసాయ పరికరాల రాయితీని ప్రభుత్వం విడుదల చేసినట్లు ఆమె పేర్కొన్నారు. బుధవారం నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో వ్యవసాయ యాంత్రీకరణ సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మెషనైజేషన్ పథకం కింద వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ రాజకుమారి, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, జిల్లాలోని సహాయ వ్యవసాయ అధికారులు, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు. రైతులకు విడుదల చేసిన రూ.1.99కోట్ల రాయితీ నిధుల చెక్కును కలెక్టర్ లబ్ధిదారులకు అందజేశారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించండి : సీఎస్

కర్నూలు కలెక్టరేట్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కే.విజయానంద్ విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ జిల్లాలోని యోగా నిర్వహించే స్థలాలకు అవసరమైన వసతులు, సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. జూన్ 21న ఉదయం 7 గంటలకు అన్ని గ్రామ, మండల జిల్లా కేంద్రాల్లో ప్రోటోకాల్ ప్రకారం యోగా నిర్వహించాలని ఆదేశించారు.

పాతుకుపోయారు..



కర్నూలు కలెక్టరేట్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ కార్యాలయంలో పని చేసే కొందరు ఉద్యోగులకు కొన్నేళ్లుగా రెవెన్యూ కార్యాలయం అడ్డాగా మారింది. ప్రభుత్వాలు మారినా, వేరే ప్రాంతాలకు బదిలీ అయినా కూడా అదేస్థానంలో కొన్ని సంవత్సరాల నుంచి నేటికీ కొనసాగుతున్నారు. డీఆర్వో కార్యాలయంలో వీరు కొన్ని సంవత్సరాలుగా పాతుకుపోవడంతో జిల్లా రెవెన్యూ శాఖ విధులకు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపణలున్నాయి. రెవెన్యూ సెక్షన్‌లో జరిగే బదిలీలు, పదోన్నతులు వంటి అంశాలను కింది స్థాయి ఉద్యోగులకు చేరవేసి అవరోధంగా తయారయ్యారన్న విమర్శలున్నాయి. డీఆర్వో కార్యాలయం నుంచి బదిలీ అయితే డీఎస్‌వో ఆఫీసుకు, మరలా బదిలీ అయితే.. డీఎస్‌వో నుంచి డీఆర్వో కార్యాలయానికి బదిలీ వస్తున్నారు. డీఆర్వో కార్యాలయంలోని ఏ నుంచి హెచ్ వరకు సెక్షన్‌లో కొన్ని సంవత్సరాలుగా పని చేస్తున్న కొందరు ఉద్యోగులు ఉన్నతాధికారులను శాసించే స్థాయికి ఎదిగారు. బదిలీలలో స్థానం మారినా కూడా ముడుపులతో సరిపుచ్చి డిప్యుటేషన్‌పై నేటికి కొనసాగుతున్నారు. రెవెన్యూ శాఖలో బదిలీలు పూర్తయ్యాయి. బదిలీల్లో నూతన స్థానాలు కేటాయించారు. నూతన స్థానాలు కేటాయించినా ఇంకా జిల్లా రెవెన్యూ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. బదిలీ ఉత్తర్వులు పొందిన ఇతర స్థానాల ఉద్యోగులు కొత్తస్థానాలకు వచ్చారు. పాత స్థానాల్లో కొనసాగుతున్న రెవెన్యూ కార్యాలయంలోని ఉద్యోగులను రిలీవ్ చేయకుండా 11 రోజులుగా రెవెన్యూ అధికారులు ఉత్తర్వులు ఇవ్వడం లేదు. అధికారులు కాలయాపన చేస్తున్నారని విమర్శలు వెలువెత్తుతున్నాయి.

నామాటే శాసనం..

క్రిష్ణగిరి మండలం ఎమ్మార్వో కార్యాలయానికి చెందిన రెవెన్యూ అధికారి డీఆర్వో కార్యాలయంలోని ఏ-సెక్షన్‌లో అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు లేకుండా నేటికి అనధికారికంగా పని చేస్తున్నారు. క్రిష్ణగిరి ఎమ్మార్వో కార్యాలయంలో పని చేస్తున్నారా... డీఆర్వో కార్యాలయంలో పని చేస్తున్నారా అని ఆయనపై అనేక సందేహాలు వ్యక్తమవతుఉన్నాయి. ఆయనను ఎవరు అడిగినా డిప్యుటేషన్‌పై కొనసాగుతున్నాను.. మరికొందరు అడిగితే ఉన్నతాధికారులు పిలిచారు కాబట్టి డీఆర్వో కార్యాలయానికి వచ్చానని సమాధానం చెబుతున్నారు. నేడు ఆయన మీద వీరాభిమానంతో ఏ సెక్షన్‌లో డిప్యుటేషన్‌పై కొనసాగించడానికి ఇటీవల జాయింట్ కలెక్టర్‌కు ఫైల్ పెట్టారు. పదోన్నతులు, బదిలీలు తదితర రెవెన్యూ అంశాల్లో ఆయన విపరీతమైన జోక్యం చేసుకుంటున్నారని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఇటీవల గ్రేడ్-2 వీఆర్వో పదోన్నతుల నుంచి గ్రేడ్-1 పదోన్నతులు కల్పిస్తానని కొందరు వీఆర్వోలకు ఆశ కల్పించినట్లు సమాచారం. అదే విధంగా జిల్లా ఉన్నతాధికారులకు అందుతున్న ఆకాశరామన్న ఉత్తరాల ప్రమేయంపై ఆయన మీద సందేహాలు వ్యక్తమవుతున్నాయి..

రెండు రోజుల్లో రిలీవ్ చేస్తాం



బదిలీ అయిన ఉద్యోగులకు రెండులేదా మూడు రోజుల్లో రిలీవ్ చేస్తాం. బదిలీ అయిన స్థానాల్లో కొత్తవారు త్వరగా విధుల్లో చేరాలి. విధుల్లో చేరిన తర్వాత డీఆర్వో కార్యాలయంలో వీలైనంత త్వరగా నూతన స్థానాలను కేటాయిస్తాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీలు చేపట్టాం.

- వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి డీఆర్వో, కర్నూలు

బదిలీల్లో పైరవీలు

ఇటీవల రెవెన్యూ ఉద్యోగుల బదిలీలు జరిగాయి. ఈ బదిలీల్లో డీఆర్వో కార్యాలయంలో కొందరు ఉద్యోగులు పైరవీలు చేశారని ఆరోపణలున్నాయి. ఐదేళ్లు దాటిన వారికి తప్పనిసరిగా బదిలీ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ప్రభుత్వ ఉత్తర్వులను తుంగలో తొక్కి మరలా అదే సెక్షన్‌లో అదే స్థానం లేదంటే మరొక సెక్షన్‌లో స్థానాన్ని ఉన్నతాధికారులు కేటాయించారు. ఏ సెక్షన్‌లో పనిచేస్తున్న ఏ1, ఏ7 దాదాపు పది సంవత్సరాలుగా అదేస్థానంలో మరలా బదిలీలలో నేటికి అదే పోస్టింగ్ ఇచ్చారు. బీ-సెక్షన్‌లోని బీ-1, సీ-సెక్షన్‌లోని సీ-1, డి-సెక్షన్‌లోని డీ-5, ఈ-సెక్షన్‌లోని ఈ-1, జీ-సెక్షన్‌లోని ఏ2, అలాగే మరికొందరు ఏడు నుంచి పదేళ్ల వరకు ఇక్కడే పని చేస్తున్నారు. కొందరిని డిప్యుటేషన్‌పై కొనసాగించడానికి మరలా జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఫైల్ పెట్టడం కొసమెరుపు. కొత్తవారికి అవకాశం ఇస్తే రెవెన్యూ శాఖ కార్యాలయం గాడిలో పడుతుందని ప్రజాసంఘాలు వ్యక్తం చేస్తున్నాయి.

లోకజ్ఞానం, క్రమశిక్షణ తప్పనిసరి

- అరుణభారతి వ్యవస్థాపకులు బీసీ రాజారెడ్డి
- 'పది' టాపర్లకు రూ.3 లక్షల ప్రోత్సాహకాలు



బనగానపల్లె మండల టాపర్ సాధించిన విద్యార్థినికి నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, జూన్ 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు లోకజ్ఞానం, క్రమశిక్షణ అలవర్చుకుంటేనే భవిష్యత్‌లో ఉన్నత లక్ష్యాలను చేరుకోగలరని అరుణభారతి వ్యవస్థాపకులు, మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పిలుపునిచ్చారు. పదోతరగతిలో బనగానపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను సన్మానించారు. బనగానపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి బీసీ రాజారెడ్డి హాజరై ఒక్కో విద్యార్థికి రూ.50వేల చొప్పున ఆరుగురికి నగదు ప్రోత్సాహం, జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తల్లిదండ్రులు బీసీ లక్ష్మమ్మ, బీసీ గుర్రెడ్డిల జ్ఞాపకార్థం విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించడంలో బీసీ కుటుంబం ముందుంటుదన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యార్థులు రాణించడం అభినందనీయమన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, ప్రముఖ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. పది తర్వాత ఇంటర్ విద్య అత్యంత కీలకమైన దశ అన్నారు. ఈ దశలో క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థానాలకు ఎదగాలన్నారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలన్నారు. ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులే ఐఏఎస్, ఐపీఎస్‌లు అయ్యారన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఎల్.వేణుగోపాల్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువుల పట్ల విద్యార్థులు గౌరవం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అరుణభారతి మధుసూధన్‌రెడ్డి, ఎంఈవో స్వరూప, హెచ్‌ఎం ప్రసాదరావు, జ్యోతిష్య పండిట్ వెంకటరాముడు, రిటైర్డు హెచ్‌ఎం. పక్కీర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాధిక, ప్రజావైద్యశాల డాక్టర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్య, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యత ఇచ్చిన పెండేకంటి



వెంకటసుబ్బయ్య జీవిత చరిత్ర పుస్తకావిష్కరణలో పాల్గొన్న పెండేకంటి బాలాజీ తదితరులు

బనగానపల్లె, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విద్య, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన గొప్పమేధావి మాజీ కేంద్రహోం శాఖామంత్రి, మాజీ గవర్నర్ పెండేకంటి వెంకటసుబ్బయ్య అని వాసవీ విద్యా సంస్థల సీఈవో పెండేకంటి బాలాజీ అన్నారు. పెండేకంటి వెంకటసుబ్బయ్య 104వ జయంతి పురస్కరించుకొని డాక్టర్ పాణ్యం వసుంధర రచించిన రాజనీతి ఘనాపాటి పెండేకంటి పేరుతో ఆయన జీవిత చరిత్ర విశేషాల పుస్తకా విష్కరణ కార్యక్రమం బనగానపల్లె మండలం ఇల్లూరు కొత్తపేట పెండేకంటి పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించారు. పుస్తక రచయిత పాణ్యం వసుంధరను పలువురు అభినందించారు. పెండేకంటి బాలాజీ మాట్లాడుతూ సామాన్యులకు విద్యను అందుబాటులో తెచ్చేందుకు వాసవీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో బనగానపల్లెలో ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాఖ్యాత డాక్టర్ శ్యాంసుదర శాస్త్రి, హనుమంతరావు, పార్థసారధి, డాక్టర్ శ్రీనివాసులు, పూర్వ విద్యార్థులు నాగ రాజు, పెండేకంటి రమణ్‌కుమార్, రాఘవేంద్ర, ఎన్నారై శ్రీధర్, బుడ్డా శ్రీకాంత్‌రెడ్డి, భూమా జగన్ తదితరులు పాల్గొన్నారు.

యోగా.. మన సంపద

- కలెక్టర్ రాజకుమారి
- ఆధ్యాత్మిక క్షేత్రంలో ఆసనాలు
- పాల్గొన్న రెండు వేల మంది



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్, జేసీ

ఆళ్లగడ్డ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాలు అనుసరిస్తున్న యోగాసనాలు మనదేశ వారసత్వ సంపద అని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. మన దేశంలో పుట్టిన యోగాను ప్రపంచవ్యాప్తంగా నిర్వహించుకోవడం గర్వంగా ఉందన్నారు. ఆధ్యాత్మిక క్షేత్రమైన అహోబిలంలో బుధవారం రెండు వేల మందితో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జేసీ విష్ణుచరణ్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి యోగాంధ్ర వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైతన్య ఆశ్రమం యోగా గురువు దామోదర కుమార్‌రెడ్డి యోగాసనాలు వేయించి వాటి గురించి వివరించారు. అనంతరం కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగక్రియలు అచరించి ఆధ్యాత్మిక, మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పొందాలని సూచించారు. నంద్యాల టెక్కె మార్కెట్ యార్డులో 5,200 మంది ప్రభుత్వ ఉద్యోగులతో థిమాటిక్ యోగాను విజయవంతంగా చేశామన్నారు. ఈనెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బనగానపల్లె బృందం ప్రదర్శించిన యోగా స్కిట్‌కు రాష్ట్ర స్థాయిలో బహుమతి రావడం అభినందనీయమన్నారు. యోగా శిక్షణకు సహకరించిన పతంజలి, రామకృష్ణ మిషన్, నేచర్ గురువులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సీఈవో సౌందర్యరాజన్, ప్రధాన అర్చకులు రమేష్, నంద్యాల ఆర్డీవో చల్లా విశ్వనాథ్, డీఎంహెచ్‌వో వెంకటరమణ, ఆయుష్ వైద్యాధికారి యశోధర, తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, ఎంపీడీవో నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.



27 ఏళ్ల తర్వాత ఫార్మసీ ఆఫీసర్ బదిలీ

ఆఫీసర్ బదిలీ నిలిపిన ఆర్‌డీ

కర్నూలు హాస్పిటల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ఐ-హాస్పిటల్, కర్నూలు జీజీహెచ్‌లో లాంగ్ స్టాండింగ్‌లో ఉన్న ఇద్దరు ఫార్మసీ ఆఫీసర్లలో ఒకరి బదిలీని (రిటేషన్) నిలిపివేసి, మరో ఫార్మసీ ఆఫీసర్‌ను పీహెచ్‌సీకి కడప ఆర్‌డీ బదిలీ చేశారు. మంగళవారం అర్ధరాత్రి వరకు కడప ఆర్‌డీ.. డీఎంహెచ్‌వో ఆఫీసరుతో జూమ్ బదిలీల కౌన్సిలింగ్ నిర్వహించారు. జోనల్‌లో అత్యధికంగా లాంగ్ స్టాండింగ్‌లో ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో పని చేస్తున్న వి. విజయలక్ష్మి ఆఫీస్ బేరర్ సర్టిఫికెట్ మొదటిసారిగా ఉపయోగించుకోవడంతో ఆమె బదిలీని కడప ఆర్‌డీ నిలిపేశారు. ఆ తర్వాత కర్నూలు జీజీహెచ్‌లో 27 ఏళ్లుగా లాంగ్ స్టాండింగ్‌లో ఉన్న ఫార్మసీ ఆఫీసర్ బి. కృష్ణమోహన్‌శర్మను ఉలిందకొండ పీహెచ్‌సీకి బదిలీ చేశారు. కర్నూలు జీజీహెచ్‌కు గోనెగండ్ల ఫార్మసీ ఆఫీసర్ డా. జగదీష్‌ను గోనెగండ్ల పీహెచ్‌సీకి, దైవందిన్నె పీహెచ్‌సీకి చెందిన రామకృష్ణను ఉలిందకొండ నుంచి వీరాంజనేయులు బైర్లూటికి, పెద్దతుంబలం నుంచి దైవందిన్నెకు హేమలత, పుచ్చకాయలమడ పీహెచ్‌సీ నుంచి కమ్మరచెడు పీహెచ్‌సీకి సురేంద్రబాబును బదిలీ చేశారు. పెద్దతుంబలానికి నాగరాజు, పుచ్చకాయలమడకు రామకృష్ణారెడ్డి, కల్లూరుకు శిరోమణి బదిలీ అయ్యారు. అయితే జోనల్ క్యాడర్‌లో 31 ఏళ్ల లాంగ్ స్టాండింగ్‌లో ఉన్న ఫార్మసీ ఆఫీసర్ బదిలీని నిలిపివేయడంపట్ల జూమ్ కౌన్సిలింగ్‌లో కొందరు ఫార్మసీ ఆఫీసర్లు నిలదీసినట్లు తెలిసింది.

సుస్థిరాభివృద్ధి కోసం..

- పండ్లు, పూలతోటల సాగుకు వంద శాతం రాయితీ
- రైతులకు 'ఉపాధి హామీ' బాసట
- సన్న, చిన్నకారు రైతులకు చక్కటి అవకాశం
- జిల్లాలో ఈ ఏడాది 4,700 ఎకరాల సాగు లక్ష్యం

శిరివెళ్ల, జూన్ 18(ఆంధ్రజ్యోతి) : ఆర్థికంగా వెనకబడిన సన్న, చిన్నకారు రైతులు సుస్థిరాభివృద్ధిని సాధించేందుకు వంద శాతం రాయితీ ఇచ్చి ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా పండ్లు, పూలతోటల పెంపకానికి ఉపాధి హామీ పథకం రైతులకు అండగా నిలుస్తోంది. పండ్ల తోటలు, మల్లె, గులాబీ తోటలు సాగు చేయాలనుకునే సన్న, చిన్నకారు రైతులకు భూమి చదును చేసే దగ్గర నుంచి మొక్కల సంరక్షణ వరకు ఆర్థిక ప్రోత్సాహాన్ని అందిస్తోంది. రైతన్నకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చేయూతనిస్తోంది. నంద్యాల జిల్లాలో గతేడాది 2,200 ఎకరాల్లో రైతులు రాయితీపై పండ్లు, పూల తోటలు సాగుచేయగా ఈ ఏడాది 4,700 ఎకరాల సాగు లక్ష్యాన్ని ఎంచుకున్నారు. ఇందుకు గాను గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు ఈఅవకాశాన్ని వినియోగించు కునేలా ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 2 వేల ఎకరాల్లో రైతులు వివిధ రకాల పండ్లు, పూలతోటలు సాగు చేశారు.



రాయితీపై సాగు చేసిన చీని తోటను చూపుతున్న రైతు

పండ్ల తోటలకు మూడేళ్లు..

మామిడి, అంజీర, చీని, నిమ్మ, జామ, తైవాన్ జామ, సపోట, దానిమ్మ, కొబ్బరి, సీతాఫలం, అల్లనేరేడు, చింత, ఆపిల్ బేర్, ఆయిల్ పామ్, డ్రాగన్ ఫ్రూట్, గుండు మల్లెలు, గులాబీ పూలు, మునగ తోటల సాగుకు ప్రభుత్వం రాయితీ కల్పిస్తోంది. పండ్ల తోటలకు మూడేళ్ల పాటు, పూల తోటలకు రెండేళ్ల పాటు నిబంధనల మేరకు నిధులు అందిస్తుంది. ఇందులో డ్రాగన్ ఫ్రూట్ సాగుకు 0.5ఎకరాలకు, గుండు మల్లెలు, గులాబీ, మునగ తోటల సాగుకు 0.25 నుంచి ఒక ఎకరాకు మాత్రమే రాయితీని అందిస్తారు. రైతులు ఉపాధి హామీ జాబ్‌కార్డు కలిగి ఉండి ఐదు ఎకరాల లోపు మాత్రమే సాగు భూమి కలిగి ఉన్న వారు అర్హులు. రైతులు తమ జాబ్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు నకలుతో గ్రామాల్లోని ఉపాధిహామీ క్షేత్ర సహాయకుల ద్వారా మండల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి.

పూలతోటల సాగుకు..

రైతులు పూలతోటల సాగుకు ఆసక్తి చూపుతుండడంతో ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సాహం అందిస్తోంది. గుండు మల్లెల సాగుకు గరిష్ఠంగా ఎకరాకు 4 0 0 మొక్కలతో తోటను సాగుచేస్తే ఏడాదికి రూ.55,124 చొప్పున రెండేళ్ల పాటు అం దిస్తారు. గులాబీ పూల సాగుకు గరిష్ఠంగా ఎకరాకు 500 మొక్కలతో తోటను సాగు చేసిన రైతులకు ఏడాదికి రూ.62,355 చొప్పున రెండేళ్లు జమ చేస్తారు. అలాగే మునగ తోటకు గరిష్ఠంగా ఎకరాకు 112 మొక్కలకు గాను సంవత్సరానికి 27,515 చొప్పున రెండు సంవత్సరాలపాటు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు ఇస్తారు.

అవగాహన కల్పిస్తున్నాం



ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు పండ్లు, పూలతోటలు సాగు చేసేందుకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాల్లోని క్షేత్ర సహాయకుల ద్వారా రైతులకు పథకం గురించి సమగ్ర వివరాలు అందజేస్తున్నాం. పండ్లు, పూలతోటల సాగు లాభదాయకంగా చేపట్టేందుకు వంద శాతం రాయితీపై రైతులకు ప్రోత్సాహం అందిస్తున్నాం.

-సూర్యనారాయణ, డ్వామా పీడీ, నంద్యాల జిల్లా

రైతులు దరఖాస్తు చేసుకోవాలి

మల్లె, గులాబీ పూలతోటల పెంపకానికి అర్హత, ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలి. క్షేత్రస్థాయిలో భూమిని పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తాం. పండ్లు, పూలతోటల సాగుద్వారా రైతులకు వ్యవసాయం లాభసాటిగా మార్చేం దుకు వంద శాతం రాయితీ ఇస్తున్నాం. -రామసుబ్బయ్య, ఏపీవో, శిరివెళ్ల



రైతులు సాగు చేసిన మల్లె తోట

జీజీహెచ్‌లో 12 మంది నర్సింగ్ సిబ్బంది బదిలీ

కర్నూలు హాస్పిటల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జీజీహెచ్‌లో 12 మంది హెడ్ నర్సులు బదిలీ అయ్యారు. వీరిలో హెడ్ నర్సులు జే. నిర్మల (లద్దగిరి), కే. ఉమాదేవి (అనంతపురం), సుభాషిణి ఆశీర్వాదం (అనంతపురం), సుగుణవతమ్మ (అనంతపురం), కే. సరస్వతి (తిరుపతి), ప్రమీల (తిరుపతి), వసంత (కడప), మాధవీలత (కడప), లక్ష్మీనరసమ్మ (గోనెగండ్ల పీహెచ్‌సీ నుంచి కర్నూలు జీజీహెచ్)కు శ్రీదేవి (రిటేషన్), జ్యోతి (రిటేషన్) అయ్యారు.

నవోదయ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి



ప్రిన్సిపాల్ పద్మావతి

ఎమ్మిగనూరు రూరల్, జూన్18(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 3, 4వ తరగతులు చదివి ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 01.05.2014 నుంచి 31.07.2016 మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునేందుకు 29.07.2025 చివరి తేదీ అని, రాత పరీక్ష 13.12.2025 శనివారం రోజున ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు నవోదయ విద్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

లంచం.. లాంఛనం!

(5వ పేజీ తరువాయి)

ఈ లెక్కన జిల్లాలో 110 మద్యం దుకాణాలు నుంచి నెలనెలా రూ.కోటికి పైగా వాటా రూపంలో పలువురి చేతులు మారుతున్నట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. జిల్లాలో పశ్చిమ ప్రాంతానికి చెందిన ఓ నియోజకవర్గంలో ముఖ్య ప్రజాప్రతినిధి ఒకరు ఒక్కో మద్యం షాపు నుంచి నెలనెలా రూ.50-75 వేలు తనకు తెచ్చి ఇవ్వాలని, తన అనుమతితో నిర్వహించే మద్యం దుకాణాల నుంచి మామూళ్లు తీసుకోరాదని ఓ ఎక్సైజ్ సీఐని ఆదేశించినట్లు సమాచారం. ఈ విషయాన్ని సదరు సీఐ జిల్లా ఉన్నతాధికారులకు చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. మరో నియోజకవర్గంలో ముఖ్య ప్రజాప్రతినిధి సోదరుడు మద్యం షాపులను సిండికేట్‌గా ఏర్పాటు చేసి లాభాల్లో తన వాటాగా 40 శాతం, లైసెన్స్‌దారులు, అనుచరులకు 60 శాతం ఇస్తున్నారని సమాచారం. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఓ నియోజకవర్గంలో ప్రతి దుకాణం నుంచి ఒక రేటు చొప్పున ముఖ్య రాజకీయకుడి నెల మామూళ్లు వెళ్తున్నాయనే ఆరోపణలు లేకపోలేదు. ఈ నియోజకవర్గంలో ఎక్సైజ్ సీఐ ఒకరు అన్నీతానై మద్యం షాపుల నుంచి నెల మామూళ్లు వసులు చేసి కొందరు రాజకీయ నాయకులు, అధికారులకు వాటాలు పంచుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

నేతల అండతో గ్రామాల్లో బెల్టుషాపులు

గ్రామాల్లో బెల్ట్ షాపులు పెడితే కఠిన చర్యలు ఉంటాయని ప్రభుత్వం పదేపదే చెబుతున్నా అమలు కావడం లేదు. జిల్లాలో ఏ పల్లెకు వెళ్లినా మద్యం బెల్ట్ షాపులు కనిపిస్తున్నాయి. నెలనెలా మామూళ్లు అందుతుండడంతో ఎక్సైజ్ నిఘా యంత్రాంగం, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదు. మద్యం వ్యాపారంలో 30-40 శాతం వాటా బెల్ట్ షాపుల నుంచి వస్తుందని ఎక్సైజ్ అధికారి ఒకరు పేర్కొన్నారు. దీన్నిబట్టి ఇవి ఏ స్థాయిలో విస్తరించిందీ తెలుసుకోవచ్చు. కేసులు కోసం అప్పుడప్పుడు నామమాత్రపు దాడులతో సరిపుచ్చుతున్నారు. అంతేకాదు.. వైన్ షాపుల వద్ద, రోడ్లపైనే మద్యం తాగుతున్నా అడిగేవారు లేరు. షాపులను బార్లుగా మార్చేశారనే ఆరోపణలు ఉన్నాయి. కర్నూలు నగరంలో మదర్ థెరిసా సర్కిల్‌కు సమీపంలో నివాస గృహాల పక్కనే ఏర్పాటు చేసిన ఓ వైన్ షాపును బారుగా మార్చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నేషనల్ హైవే పక్కనే ఉన్న దాబాలు అనధికారిక బార్లుగా మార్చేసినా అడిగేవారు లేరు. ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ, కోడుమూరు నియోజకవర్గం కేంద్రాల్లో వైన్ షాపుల వద్ద రోడ్లపైనే మద్యం సేవిస్తున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అయితే.. ప్రభుత్వం మద్యం అమ్మకాలు టార్గెట్ పెట్టిందని, బెల్ట్ షాపులు నియంత్రిస్తే.. టార్గెట్ సాధ్యం కాదని, తద్వారా ప్రభుత్వ ఆదాయం తగ్గుతుందని, అందువల్ల చూసీ చూడనట్లుగా వెళ్తున్నామని ఓ అధికారి పేర్కొనడం కొసమెరుపు.



మామూళ్లు ఇవాల్సిన అవసరం లేదు

మద్యం దుకాణాల లైసెన్స్‌దారులు ఎవరికీ మామూళ్లు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎవరైనా డిమాండ్ చేస్తే రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. అక్కడక్కడా బెల్ట్ షాపులు ఉన్నట్లు మా దృష్టికి వచ్చింది. నిఘా ఉంచి దాడులు చేస్తున్నాం.

- సుధీర్‌బాబు, సూపరింటెండెంట్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ, కర్నూలు

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడి బలి



విశ్వేశ్వరరెడ్డి (ఫైల్)

కొలిమిగుండ్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్‌కు మరో యువకుడు బలై య్యాడు. మండలంలోని ఎర్రగుడి గ్రామానికి చెందిన ఆవుల విశేశ్వరరెడ్డి(28) అనంతపురం జిల్లా తాడిపత్రి రైల్వేస్టేషన్‌లో రైలు కింద పడి బుధవారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్నాడు. విశేశ్వరరెడ్డి కొంత కాలంగా ఆన్‌లైన్ బెట్టింగులతో చాలా అప్పులు చేసినట్లు తెలుస్తోంది. దీంతో చేసిన అప్పులు తీర్చలేక, ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యకు ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ఇటీవల నెల రోజుల క్రితం ఓ యువకుడు ఆన్‌లైన్ బెట్టింగ్‌ల కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మరవక ముందే మరో యువకుడు బలి కావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తాడిపత్రి రైల్వే ఎస్‌ఐ నాగప్ప కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి దారుణ హత్య

నంద్యాల టౌన్, జూన్18 (ఆంధ్రజ్యోతి): నూనెపల్లె త్రీ టౌన్ పరిధిలో మంగళవారం రాత్రి దస్తగిరి (65) అనే వృద్ధుడు దారుణ హత్యకు గురయ్యాడు. రుద్రవరం మండలం కొండమాయపల్లెకు చెందిన దస్తగిరి గత కొన్ని ఏళ్ల కిందట ఇల్లు వదిలి వెళ్లి ఎప్పుడో ఒకసారి ఊరికి వచ్చేవాడు. నంద్యాలలో భిక్షాటన చేస్తూ జీవించేవాడు. అయితే రాత్రి గుర్తు తెలియన వ్యక్తులు ఆయన్ను హత్య చేశారు. ఈ ఘటన మద్యం మత్తులో జరిగిందా? లేక ఆయన వద్ద డబ్బు ఉంటే దాని కోసం అల్లరి మూకలు ఈ ఘాతుకానికి పాల్పడ్డారా..? అనేది తేలాల్సి ఉందని మూడో పట్టణ ఇన్‌చార్జి సీఐ ఈశ్వరయ్య తెలిపారు. మృతుడికి ఇద్దరు భార్యలు, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలుస్తోంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మ్యాన్‌హోల్‌లో పడి వృద్ధురాలి మృతి

నంద్యాల టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పరిధిలోని ఆర్టీసీ ప్రాంగణంలోని మ్యాన్‌హోల్‌లో పడి వృద్ధురాలు మృతి చెందారు. వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలివీ.. గుర్తు తెలియని వృద్ధురాలు ప్రమాదవశాత్తు మ్యాన్‌హోల్‌లో పడ్డారు. స్థానికులు గుర్తించి ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందారు. మృతురాలికి సంబంధించిన వారు ఎవరైనా వస్తే వన్‌టౌన్ పోలీసులను సంప్రందించాలని సీఐ సూచించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కర్నూలు క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోట్ల రైల్వే స్టేషన్ వద్ద రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి శరీరంపై లైట్ పింక్ కలర్ ఫుల్ హ్యాండ్ షర్టు, నలుపు రంగు షార్ట్, నీలం, ఆకుపచ్చ గడులు ఉన్న పంచ ఉంది. మృతుడి ఎడమ చేతిపై నారాయణ అక్షరాలు ఉన్న పచ్చబొట్టు, కుడిచేతిపై తేలుబొమ్మ ఉన్న పచ్చనిబొట్టు ఉంది. మృతుడి వయస్సు 55ఏళ్లు ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్రీనాథ్‌రెడ్డి, సెల్‌నెంబర్ 9441802327కు ఫోన్ చేయాలని తెలిపారు.

కువైట్ నుంచి చాగలమర్రికి చేరిన మహిళ

- ఎస్పీ ఆదేశాలతో ఎస్‌ఐ చర్యలు

చాగలమర్రి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధికై కువైట్‌కు వెళ్లి అక్కడ ఇబ్బందులు పడుతున్న మహిళను బుధవారం ఎస్‌ఐ సురేష్ చాగలమర్రికి రప్పించేలా కృషి చేశారు. చాగలమర్రికి చెందిన ఉసేనమ్మ కువైట్‌లో అవస్థలు పడుతూ, అక్కడి యజమానుల హింస భరించలేక పలుమార్లు నంద్యాల ఎస్పీ దృష్టికి వీడియో ద్వారా తీసికెళ్లింది. స్పందించిన ఎస్పీ మహిళకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని చాగలమర్రి ఎస్‌ఐని ఆదేశించారు. కువైట్‌కు పంపించిన కడప జిల్లా ఖాజీపేటలో ఉన్న ఏజెంట్ ద్వారా తిరుగు ప్రయాణం టికెట్‌ను ఎస్‌ఐ సురేష్ బుక్ చేయించారు. ఉసేనమ్మను చాగలమర్రికి తీసుకొచ్చారు.

కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యంగా పని చేద్దాం



సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేద్దామని మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లాలోని నియోజకవర్గాల కో ఆర్డినేటర్లు, నగర అధ్యక్షుడు షేక్ జీలానీ బాషా, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేంద్రనాయుడు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బి. బ్రతుకన్న ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షురాలు జిల్లా పర్యటన తీరుపై చర్చించారు. రాష్ట్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి అందరూ కృషి చేయాలన్నారు. నాయకులు బాబురావు, దామోదరం రాధాకృష్ణ, కాశీంవలీ, అనంతరత్నం మాదిగ ఉన్నారు.

బోర్డులతో బోల్తా కొట్టించారు..

- క్షణాల్లో బోర్డు మార్చిన నర్సింగ్ కాలేజీ యాజమాన్యం
- అప్పటి వరకు జూనియర్ కళాశాల ఆవెంటనే నర్సింగ్ స్కూల్
- కర్నూలులో ఉన్న కళాశాల అనుమతితో సర్టిఫికెట్లు
- అంధకారంలో విద్యార్థుల భవితవ్యం

ఉన్నవి లేనట్లు.. లేనివి ఉన్నట్లు





మరో చోట ఉన్న అసలైన ఆర్‌ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాల

ఆదోని అగ్రికల్చర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): బోర్డులు మార్చి క్షణాల్లో అధికారులను బోల్తా కొట్టించారు. సినీ ఫక్కీలో అప్పటికప్పుడు అన్ని సర్దుబాటు చేశారు. తనిఖీల కోసం వచ్చిన అధికారులు వారి మాట వినేలా చేశారు. మీడియా ప్రతినిధులను తప్పుదోవ పట్టించారు. అధికారులు రాలేదంటూ అబద్ధాలు పలికారు.. శంకర్ దాదా ఎంబీబీఎస్ తరహాలో సాగిన ఈఘటన ఆదోనిలో చోటుచేసుకుంది. వివరాలు.. పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల రహదారిలో వెంకటేశ్వర జూనియర్ కళాశాల పక్కన ఆర్‌ఎస్ నర్సింగ్ స్కూల్‌ను మూడేళ్ల కిందట ఏర్పాటుచేశారు. ఓఇంటిని అద్దెకు తీసుకొని ఆర్‌ఎస్ నర్సింగ్ స్కూల్ అంటూ బోర్డు పెట్టేశారు. ఇంటర్ పూర్తయిన వారికి జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫైరీ (జీఎన్‌ఎమ్) మూడున్నరేళ్ల కోర్సుకు ప్రవేశాలు జరుపుకున్నారు. మూడేళ్లుగా ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకున్నా జీఎన్‌ఎమ్ తరగతులు నిర్వహిస్తున్నారు. కర్నూలు కళాశాలకున్న అనుమతులతో సర్టిఫికెట్లను వారికి అందజేస్తున్నట్లు తెలుస్తుంది.

అప్పటికప్పుడు అన్ని మార్పు..

విశ్వనారాయణ జూనియర్ ఒకేషనల్ కళాశాల బోర్డు స్థానంలో ఆర్‌ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ స్టిక్కర్‌ను అప్పటికప్పుడే అతికించేశారు. అప్పటికప్పుడే గేటుకు ఓ బోర్డును తగిలించారు. ఆజూనియర్ కళాశాలకు చెందిన బస్సును సైతం ముందు భాగంలో ఆర్‌ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ అంటూ స్టికర్ చేశారు. ఫ్యాకల్టీ ఎవరు లేకున్నా కర్నూలు నుంచి వారిని కార్లలో రప్పించి తెల్లకోటు (యాప్రాన్) ధరింప చేసి వీరే బోధించే ఫ్యాకల్టీ అని చూపించారు. ఆర్‌ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌కు ల్యాబ్‌లు లేకున్నా గంటపాటు కళాశాలకు చెందిన ల్యాబ్‌లు ఉన్నాయంటూ సెట్ చేశారు. మీడియా ప్రతినిధులకు అధికారులు తనిఖీలకు వస్తున్నారని తెలియ డంతో అక్కడికి వెళ్లారు.



అధికారుల తనిఖీకి ముందు నర్సింగ్ కళాశాల బోర్డు



తనిఖీ అనంతరం విశ్వనారాయణ కళాశాలగా మార్పు

అనుమతుల కోసం..

ఆదోనిలో ఆర్‌ఎస్ నర్సింగ్ స్కూల్ ఉందని ఇటీవల అనుమతుల కోసం ప్రభుత్వా నికి దరఖాస్తు చేసుకున్నారు. వైద్యారోగ్య శాఖ విజయవాడ డీఎంఈ రిజిస్టర్ కార్యాలయం నుంచి తనిఖీల కోసం బుధవారం అధికారులు వచ్చారు. ముందుగానే ఆర్‌ఎస్ నర్సింగ్ స్కూల్ ఆఫ్ కళాశాల యాజమాన్యానికి సమాచారం ఇవ్వడంతో అప్పటికప్పుడే అదే ఏరియాలో వెనుక రోడ్డులో ఉన్న విశ్వనారాయణ ఒకేషనల్ జూనియర్ కళాశాలను అదే అంటూ చూపించే ప్రయత్నించారు. విశ్వ నారాయణ కళాశాల యాజమాన్యం విద్యార్థులకు సెలవు ప్రకటించి ఆర్‌ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌కు గంటపాటు అప్పచెప్పారు. అధికారులు వచ్చే లోపు అక్కడున్న వాతావరణం అంతా మార్చేశారు.

తనిఖీకి వస్తున్నారంటే..

ఆర్‌ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ యాజమాన్యం వాళ్లు అనుమతులు దరఖాస్తు చేసు కున్నామని, అధికారులు తనిఖీ కోసం వస్తున్నారంటూ బిల్డింగ్ కావాలని చెప్పడంతో సరే అన్నా. మా కళాశాలలో ల్యాబ్, ప్రిన్సిపాల్ గదిని, తరగతి గదులను తనిఖీ అధికారులకు చూపించారు. మా బోర్డు తీసేసి ఆర్‌ఎస్ స్కూల్ ఆఫ్ స్కూల్ స్టిక్కర్‌ను అతికించుకున్నారు. తనిఖీలు అయిన వెంటనే మాకళాశాల మాకు అప్పజెప్పారు. **- మల్లికార్జున, కరస్పాండెంట్, విశ్వనారాయణ కళాశాల, ఆదోని**

మీడియా ప్రతినిధులను చూసి తనిఖీలకు వస్తున్న అధికారులను ఆర్‌ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ యాజమాన్యం అలా కారులోనే ఆదోని అంతా తిప్పారు. మీడియా ప్రతినిధులను తప్పుదోవ పట్టించేందుకు అధికారులు రావడం లేదంటూ కళాశాలలో ఉన్న విద్యార్థులను మరోచోటికి పంపారు. సిబ్బంది అంతా బయటికి వెళ్లారు. ఆర్‌ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ బోర్డును తిప్పేశారు. అక్కడినుంచి మీడియా ప్రతినిధులు వెళ్లిన వెంటనే అరగంటలోనే తనిఖీకొచ్చిన అధికారులను మరోమారు సెట్ చేసి లేనివి ఉన్నట్లు వారికి కళాశాల యాజమాన్యం చూపించారు. తనిఖీకొచ్చిన అధికా రులు ఆర్‌ఎస్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాల యాజమాన్యం చెప్పినట్లు నడుచుకోవడం పట్ల పలు అనుమానాలకు తావిస్తోంది. నర్సింగ్ విద్యార్థుల భవితవ్యాన్ని అంధకారంలోకి నెట్టేస్తున్నారు. కర్నూలులో ఉన్న కళాశాలలకు చెందిన గుర్తింపు సర్టిఫికెట్లను అందజేస్తున్నారు.

'మావాళ్లకే అవకాశమివ్వాలి'



ఎస్టేట్ అధికారిని నిలదీస్తున్న రైతులు, పొదుపు మహిళలు

- రైతుబజార్ అధికారులు, సిబ్బందిపై రాజకీయ నాయకుల ఒత్తిడి
- తామెక్కడికి పోవాలంటున్న రైతులు, పొదుపు మహిళలు

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు మే నెల 17వ తేదీన సి.క్యాంపు రైతుబజార్‌ను పర్యటించారు. ఆయన వెళ్లిపోయారో లేదో.. ఇక్కడ తిష్ట వేసేందుకు కొంతమంది నాయకులు, వారి అనుచరులు ఆరోజు నుంచి ఈరోజు వరకు చేయని ప్రయత్నాలంటూ లేవు. ఒక దశలో సి.క్యాంపు రైతుబజారు ఎస్టేట్ అధికారి కళ్యాణమ్మ వారి ఒత్తిడి తట్టుకోలేక ఇక్కడ తాను పని చేయలేనని, వేరే రైతుబజారుకు బదిలీ చేయించుకుని వెళ్లిపోతానని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలు.. సి.క్యాంపు రైతు బజారులో తమ వారికే వ్యాపారాలు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలంటూ ప్రతి రోజూ తెలుగు తమ్ముళ్లు అధికారులు, సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. ఈ రైతుబజారుకు ప్రధాన రహదారి కోసం సీఎం పర్యటన సందర్భంగా కొంత మంది రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేసుకునే వారి అంగళ్లను తొలగించారు. ప్రస్తుతం అక్కడ వాహనాల రాకపోకలు మాత్రమే జరిగేలా కలెక్టర్, ఎస్పీలు చర్యలు తీసుకున్నారు. దాదాపు 60మంది దాకా ఆ ప్రధాన రహదారి వద్ద కూరగాయలు అమ్ముకుని జీవనం చేసేవారు. వీరికి తప్పనిసరిగా ఉపాధి కల్పిస్తామని సి.క్యాంపు రైతుబజారును విస్తరించిన తర్వాత అక్కడ వ్యాపారం చేసుకునేందుకు అవకాశం కల్పించడంతో పాటు కొత్తగా ఏర్పాటు కానున్న కల్లూరులోని గోవర్ధనగిరి రైతుబజారులో స్టాల్స్ ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఇస్తామని వారికి రైతుబజార్ అధికారులు నచ్చజెబుతూ వస్తున్నారు. వీరంతా చోటా, మోటా నాయకులతో సి.క్యాంపు రైతుబజారులోనే వ్యాపారం చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలంటూ ప్రతి రోజు నాయకులతో ఫోన్లు, సిఫారసు లెటర్లు తీసుకువస్తుండటంతో రైతుబజారు అధికారులు, సిబ్బందికి దిక్కుతోచడం లేదు. బయటివారు రైతుబజారులోకి ప్రవేశిస్తే కొన్నేళ్లుగా ఈ రైతుబజారునే నమ్ముకుని కూరగాయలు అమ్ముకుంటున్న తామెక్కడికి పోవాలని రైతులు, పొదుపులక్ష్మి గ్రూపుల మహిళలు బుధవారం సి.క్యాంపు రైతుబజారు కార్యాలయంలో ఎస్టేట్ అధికారిని ప్రశ్నించారు. ఒక్కసారిగా రైతులంతా వచ్చి ప్రశ్నిస్తుండటంతో రైతుబజారు అధికారులకు, సిబ్బందికి దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. ఏం సమాధానం చెప్పుకోవాలో అర్థంగాక తలపట్టుకుని కూర్చున్నారు. కలెక్టర్, జేసీ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రైతులు, పొదుపుగ్రూపు మహిళలు మొర పెట్టుకుంటున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- కర్నూలు కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ రంజిత్ బాషా పేర్కొన్నారు. గత ఏడాది 1,127 మంది రైతులకు రూ.2.42 కోట్ల సబ్సిడీతో వ్యవసాయ యంత్ర పరికరాలను పంపిణీ చేశారు. ఆ రైతులతో బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల ఉత్పాదకతను పెంచడంలో వ్యవసాయ యంత్రీకరణ కీలక పాత్ర పోషిస్తుందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో గత సంవత్సరం 314 గ్రామాల్లో 1,127 మంది చిన్న సన్నకారు రైతులకు రూ.2.24 కోట్ల సబ్సిడీతో వ్యవసాయ పరికరాలను అందించిందన్నారు. బ్యాటరీ స్ప్రేయర్లు, కల్టివేటర్లు, రోటవేటర్లు, పవర్ రీడర్స్, బండ్ ఫార్మర్స్ తదితర ముఖ్యమైన పరికరాలను అందించామన్నారు. వీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. జిల్లాలో 35 డ్రోన్లు ఏర్పాటు లక్ష్యం ఉందని, ఒకవేళ అంతకంటే ఎక్కువ మంది రైతులు ముందుకు వస్తే వారితో సంఘాలను ఏర్పాటు చేసి దరఖాస్తులను తీసుకోవాలని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మికి సూచించారు. రైతులకు పరికరాలను సరఫరా చేసినందుకు ఖర్చు చేసిన రూ.2,42,30,310 మెగా చెక్కును కలెక్టర్ అందజేశారు. అనంతరం దేవనకొండ మండలానికి చెందిన బిస్మిల్లా గ్రూపునకు డ్రోగో కంపెనీకి చెందిన డ్రోన్‌ను కలెక్టర్ అందించారు. ఈ డ్రోన్ ధర రూ.9.8 లక్షలు కాగా, 80 శాతం రాయితీపై అందజేశారు.

'అతిసార' నియంత్రణకు కృషి : డీఎంహెచ్‌వో

- స్టాప్ డయేరియా క్యాంప్ పోస్టర్ విడుదల



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో డా.శాంతికళ

కర్నూలు హాస్పిటల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రత పాటించి అతిసార వ్యాధిని నివారించాలని కర్నూలు డీఎంహెచ్‌వో డా.పి. శాంతికళ పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డయేరియా నివారణ అవగాహన కార్యక్రమం స్టాప్ డయేరియా క్యాంప్ సందర్భంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జూన్ 16 నుంచి జూలై 31 వరకు డయేరియా నివారణపై అవగాహన కార్యక్రమాలు జిల్లా అంతటా ప్రతి నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఐవో డా. నాగప్రసాద్ బాబు, డీఎంహెచ్‌వో కార్యాలయ ఏవో కే. అరుణ, డెమో శ్రీనివాసుల శెట్టి, ఎస్‌వో హేమ సుందర్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్టు

- 30 వాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బైకులను పరిశీలిస్తున్న ఎస్పీ

గోనెగండ్ల/కర్నూలు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గత ఏడాదిగా పోలీసులుకు కంటిమీద కునుకు లేకుండా చేసిన ద్విచక్ర వాహనాల దొంగను ఎట్టకేలకు గోనెగండ్ల పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. దొంగ దగ్గర నుంచి రూ. 35 లక్షల విలువ చేసే 30 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గోనెగండ్ల మండలం పెద్దమర్రివీడు గ్రామానికి చెందిన బజారి కుమారుడు వెంకటేశ్ కూలి పనులు చేసి జీవించేవాడు. విలాసాలు, మద్యానికి బానిసై సులువుగా డబ్బు సంపాదిం చాలనుకొని మొదట్లో చిన్న చిన్న దొంగతనాలకు అలవాటు పడ్డాడు. తర్వాత బస్టాండ్‌లో, ఇండ్ల ముందు, హోటళ్ల ముందు నిలిపిన ద్విచక్రవాహ నాలను దొంగతనం చేయడం మొదలు పెట్టాడు. కర్నూలు, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, దేవనకొండ, కోడుమూరు, ఓర్వకల్లు తదితర ప్రాంతాలలో ద్విచక్రవాహనాలను దొంగలించాడు. ఎస్పీ ఆదేశాలతో గోనెగండ్ల సీఐ విజయభాస్కర్ తన బృందంతో విచారణ చేపట్టారు. కొద్ది రోజులుగా పోలీసులు నిఘా పెట్టారు. దొంగ వెంకటేశ్ దొంగతనం చేసిన ద్విచక్రవాహనాలను స్వగ్రామంలోని తన పాడుబడిన ఇంట్లో దాచినట్లు పోలీసులు కనుకొన్నారు. దీంతో బుధవారం పథకం ప్రకారం మాటు వేసి పెద్దమర్రివీడు గ్రామ శివార్లలోని సుంకులమ్మ దేవాలయం దగ్గర వెంకటేశ్‌ను అరెస్టు చేసి, ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ విజయ భాస్కర్ తెలిపారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

సాక్షి గణపతికి పూజలు

నంద్యాల కల్చరల్(శ్రీశైలం), జూన్ 18(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో లోకకల్యాణార్థం సాక్షిగణపతికి బుధవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి ఉదయం పంచామృతాలతోను, పలుపుష్పోదకాలతోనూ, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం నిర్వహించారు.

వీరభద్ర స్వామికి..

శ్రీశైలం ప్రాంగణంలోని మల్లికార్జునస్వామి ఆలయానికి ఉత్తరభాగంలో మల్లికాగుండానికి పక్కనే ఉన్న వీరభద్ర స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్వామివారికి ఉదయం పంచామృతాలతో, పలు పుష్పోదకాలతో, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం నిర్వహించారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



కూచిపూడి నృత్యం చేస్తున్న కళాకారులు

నంద్యాల కల్చరల్(శ్రీశైలం), జూన్ 18(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో బుధవారం సాయంకాలం నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా హైదరాబాదు రాగరమ్య కల్చరల్ ఆర్గనైజేషన్ వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. విఘ్నంరాజం భజే, శివపాద మంజీరనాదం, శివతాండవం, భో.. శంభో, జతిస్వరం తదితర గీతాలకు అష్టకాలకు ప్రియదర్శిని, సృజన, సహస్ర, నక్షత్ర, కళ్యాణి, ఆరాధ్య తదితరులు నృత్యప్రదర్శన చేశారు. అనంతరం హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

విధులు సక్రమంగా నిర్వర్తించాలి

● శ్రీశైల క్షేత్రం ఈవో శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఈవో శ్రీనివాసరావు

నంద్యాల కల్చరల్(శ్రీశైలం), జూన్ 18(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానంలో పనిచేసే ఉద్యోగులు విధులు సక్రమంగా నిర్వర్తించాలని శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు ఆదేశించారు. శ్రీశైలంలో పరిపాలనాంశాల పరిశీలనలో భాగంగా బుధవారం శ్రీశైల క్షేత్ర సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ అన్ని విభాగాల ఉద్యోగులు కూడా పరస్పర సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు. అన్నప్రసాదవితరణలో ఆయా వంటకాలన్నీ రుచికరంగా ఉండేవిధంగా అన్నప్రసాద సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్యూలైన్‌లు పటిష్టంగా ఉండాలన్నారు. క్యూ కాంప్లెక్స్‌లో భక్తులకు నిరంతరం తాగునీరు, బిస్కెట్లు, అల్పాహారం అందిస్తూ మరింత మంది శివసేవకులను, సెక్యూరిటీ సిబ్బంది ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే దివ్యాంగుల సౌకర్యార్థం విరాళాల కేంద్రం వద్ద మరిన్ని చక్రాల కుర్చీలను అందుబాటులో వుంచాలన్నారు. సిబ్బంది అందరూ భక్తుల పట్ల మర్యాదగా మెలగాలన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి

వెలుగోడు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని వృద్ధుల ఆశ్రమం సంస్థ అధ్యక్షుడు బాస్కర్ అన్నారు. వెలుగోడు పట్టణ శివార్లలో చైతన్య కళాభారతి నంద్యాల వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి దివంగత పరమేశ్వరప్ప జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రూ.6 వేలు విలువగల రెండు ఫ్యాన్లను విరాళంగా అందచేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాజప్ప, సురేంద్రకుమార్, విజయలక్ష్మి, రూప, ఆశ్రమ నిర్వాహకురాలు వరలక్ష్మి, శ్రీనివాసగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ మీట్

నందికొట్కూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నందికొట్కూరు పట్టణ అభివృద్ధిని నాయకులు అటకెక్కించారు. ప్రతి నెల జరగాల్సిన కౌన్సిల్ సమావేశం కూడా రెండు నెలలకోసారి జరుగుతున్న పరిస్థితులు నెలకొన్నారు. పట్టణ ప్రజల సమస్యలను గాలకొదిలేసి ఆధిపత్యం కోసం కౌన్సిల్ బాడీ రెండు వర్గాలుగా విడిపోయి పోటీ పడుతున్నారు. కౌన్సిలర్లు విడిపోయి ఛైర్మన్ పీఠం కోసం పోటీ పడుతూ పట్టణ ప్రజల సమస్యలను, పట్టణాభివృద్ధిని గాలికి వదిలేశారన్న చర్చ పట్టణంలో జరుగుతోంది. ఇకనైనా ప్రతి నెలా సమావేశాలు నిర్వహించి పట్టణాభివృద్ధికి దోహదపడాలని పట్టణ ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు. లేదంటే ఒకే పార్టీలో ఉంటూ వర్గాలుగా విడిపోయి పట్టణాభివృద్ధిని విస్మరిస్తే... సార్వత్రిక ఎన్నికల్లోవైసీపీకే పట్టిన గతే వచ్చే స్థానిక ఎన్నికల్లో పడుతుందంటూ పట్టణ ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు. నేడు నందికొట్కూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని మున్సిపల్ ఛైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ఆయుష్మాన్ కార్డులను పంపిణీ చేస్తున్న ఐటీడీఏ పీవో

ఆత్మకూరురూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలపై చెంచులు అవగాహన పెంచుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వెంకట శివప్రసాద్ సూచించారు. మండలంలోని బైర్లూటి గూడెంలో బుధవారం ఏర్పాటు చేసిన గిరిజనుల సమావేశంలో అధికారులతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. గిరిజనుల కోసం కేంద్ర ప్రభుత్వం ధర్తిఆభాభగిదరి అభియాన్ కార్యక్రమంలో భాగంగా 17 మంత్రిత్వ శాఖలను అనుసంధానిస్తూ గిరిజన గూడేలలో కనీస సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గిరిజనులకు పక్కా ఇళ్లు, తాగునీటి సౌకర్యం, విద్యుత్, పక్కా రహదారుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. అలాగే ఆధార్ కార్డులు లేని గిరిజనులకు ఆధార్ కార్డులు మంజూరు చేసి, ఆయుష్మాన్ కార్డుల ద్వారా ఉచిత వైద్య సౌకర్యం, రేషన్ కార్డులులేని వారికి రేషన్ కార్డులు మంజూరు చేస్తామన్నారు. అనంతరం చెంచులకు మంజూరు చేసిన ఆయుష్మాన్ కార్డులు, రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, డిప్యూటీ తహసీల్దార్ మనోహర్, ఐటీడీఏ సిబ్బంది పాల్గొన్నారు.

విచ్చలవిడిగా బెల్టు షాపులు

● పాములపాడు మండలంలో జోరుగా మద్యం వ్యాపారం ● బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం



చెట్ల కింద మద్యం తాగుతున్న దృశ్యం

పాములపాడు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలో 13 పంచాయతీలలో విచ్చలవిడిగా బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. వందకు పైగా బెల్టు షాపులు ఉన్నా అధికారులు కన్నెత్తి చూడటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బెల్టుషాపులు నిర్వహిస్తే మద్యం సరఫరా చేసే వైన్ షాపుల లైసెన్సులు రద్దు చేస్తామన్న ప్రభుత్వ హెచ్చరికలను గాలికొదిలేశారు. అధికారులకు ముడుపులు చెల్లిస్తూ యథేచ్ఛగా వ్యాపారాలు చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాక వైన్‌షాపుల వద్ద మందుబాబులకు బార్లను తలదన్నేలా ఏర్పాట్లు చేస్తున్నారు. షాపుల వద్ద తినుబండారాలు, వాటర్, కూల్‌డ్రింక్స్ షాపులు ఏర్పాటుచేసి, కూర్చోడానికి వీలుగా అరుగులు ఏర్పాటుచేశారు. గ్రామ శివార్లలో ఏర్పాటు చేసిన ఈ షాపులు కేజీ రోడ్డు పక్కనే ఉండటం, మందుబాబులకు కిక్కు ఎక్కువై రోడ్లపైనే ఘర్షణలు పడుతుండటంతో వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది.

బెల్టుషాపు నిర్వాహకులకు పెరిగిన డిమాండ్

పాములపాడులో ప్రభుత్వ టెండర్లలో పాల్గొని మద్యం షాపు ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల ఈడిగ కులస్థులకు మరొక షాపు కేటాయించడంతో మండలంలో బెల్టుషాపు నిర్వాహకులకు డిమాండ్ పెరిగింది. షాపు యజమానులు వ్యాపారాలు పెంచుకొనేందుకు పోటీలు పడి గ్రామాలకు బెల్టుషాపులకు మద్యం సరఫరా చేస్తుండటంతో గ్రామాల్లో బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యమేమిటి? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. గ్రామాల్లో ఫోన్‌చేస్తే చాలు మద్యంపై రూ.20 అధికంగా వసూలు చేస్తూ ఇంటివద్దకే మద్యం సరఫరా చేస్తుండటం ఆశ్చర్యం. అధికారులు కేవలం ప్రెస్‌మీట్లకు మాత్రమే పరిమితమైనట్లు ప్రజలు వాపోతున్నారు.

రోడ్ల పక్కనే మద్యపానం

రోడ్ల పక్కనే మందుబాబులు మద్యం తాగుతున్నారు. మద్యం షాపుల వద్ద చెట్లకింద కూర్చొని మందు తాగుతున్నారు. అయితే వారిపై ఎందుకు కేసులు నమోదు చేయడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

మందుబాబుల బెడద

గ్రామాలలో ఇళ్లవద్దే బెల్టు షాపులు నిర్వహిస్తుండటంతో మహిళలు నిత్యావసర సరుకులు, సామగ్రి తెచ్చుకోవడానికి వీధుల్లోకి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. బానకచెర్ల, వేంపెంట, మిట్టకందాల, క్రిష్ణానగర్ తదితర గ్రామాల్లో సాయంత్రం అయితే చాలు మందుబాబులు వీధుల వెంట గొడవలు పడుతున్నారు. దీంతో మహిళలు బయటకు వెళ్లలేని పరిస్థితిలు నెలకొన్నాయి.

మద్యం షాపుల నిర్వాహకులకు భరోసా

గ్రామాల్లో బెల్టుషాపులు ఏర్పాటు చేసుకొని మద్యం అమ్ముకోవడానికి మద్యం షాపుల నిర్వాహకులు భరోసా ఇస్తున్నారు. అధికారులు పట్టుకుంటే తాము మీకు అండగా నిలుస్తామని, భయపడొద్దని అభయమిస్తున్నారు మద్యం షాపు యజమానులు అంతేకాక కావాల్సినంతా మద్యం పట్టపగలే నిర్వాహకులు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా బెల్టు షాపులను అరికట్టాలని కోరుతున్నారు.

దాడులు నిర్వహిస్తాం

ఇటీవల బాధ్యతలు చేపట్టాను. నా దృష్టికి రాలేదు. దాడులు నిర్వహించి చర్యలు తీసుకుంటాం. బెల్టుషాపులను అరికట్టడానికి అందరూ సహకరించాలి.

- మోహన్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ, ఆత్మకూరు

జిల్లా అధికారులతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్

● హాజరైన కలెక్టర్, జేసీ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ

నంద్యాల నూనెపల్లె, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 21న విశాఖపట్టణంలో నిర్వహించనున్న యోగా కార్యక్రమ సన్నద్ధతపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.విజయానంద్ ఏపీ సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి బుధవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నంద్యాల కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ పాల్గొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ విజయవంతానికి చేపట్టాల్సిన పలు అంశాలకు సంబంధించిన విషయాలను సీఎస్ కలెక్టర్లతో చర్చించారు.

సర్వేలను త్వరగా పూర్తి చేయాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రశేఖర్

పాములపాడు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ సచివాలయ సిబ్బంది జీఎస్‌డబ్ల్యూఎస్ సర్వేను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని బానకచెర్ల, వేంపెంట గ్రామ సచివాలయాలను బుధవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి విద్యార్థుల తల్లిదండ్రులతో ఈకేవైసీ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిగుండం చెరువు పరిశీలన



మద్దిగుండం చెరువును పరిశీలిస్తున్న అధికారులు

మిడుతూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని జలకనూరు మద్దిగుండం చెరువును తహసీల్దార్ శ్రీనివాసులు, ఇరిగేషన్ డీఈ బసవరాజు, విద్యుత్ డీఈ శ్రీనివాసులు, రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం బుధవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ చెరువు పరిధిలో ఉన్న ఆయకట్టుకు సంబంధించిన వివరాలను రికార్డు రూపంలో ఆర్డీవోకు పంపుతున్నట్లు వారు తెలిపారు. వీరి వెంట ఇరిగేషన్ ఏఈ వేదనారాయణ, విద్యుత్ ఏఈ క్రాంతి కుమార్, ఎస్ఐ ఓబులేసు, రైతులు ఉన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



బరకల కాలనీ గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సదరన్ ప్రతినిధి

బండిఆత్మకూరు జూన్ 18(ఆంధ్రజ్యోతి): అడవులను, జంతువులను సంరక్షించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని సదరన్ ప్రతినిధులు రాజశేఖర్, యాసికగోయిల్, శ్రీధర్ అన్నారు. బుధవారం అటవీ ప్రభావిత ప్రాంతాలైన నారాయణపురం, బరకలకాలనీ గ్రామాల్లో చెన్నై డబ్ల్యూసీసీ సదరన్ రీజియన్ సంస్థ వారు వన్యప్రాణుల, అటవీ సంరక్షణలపై ప్రజలతో సమావేశాలు నిర్వహించారు. భావితరాల మనుగడకు అడవులు ఎంతో ఉపయుక్తమన్నారు. అలాగే వన్యప్రాణులను కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో నాగరాజు, ఎఫ్‌బీవోలు రాజేష్, ఫకృద్దీన్ పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడడం చట్టరీత్యా నేరం

మహానంది: అడవుల్లోని వన్య ప్రాణులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని న్యూ ఢిల్లీకి చెందిన వన్యప్రాణి నేర నియంత్రణ సంస్థ ప్రతినిధులు రాజశేఖర్, వడివేలు అన్నారు. బుధవారం మహానంది సమీపంలోని ఈశ్వర్‌నగర్ సచివాలయం ఆవరణలో ప్రజలకు అడవుల సంరక్షణతో పాటు వన్యప్రాణుల చట్టాలు, వాటి పరిరక్షణపై అవగాహన కల్పించారు. వన్యప్రాణులను వేటాడటం నేరమని అన్నారు. అటవీ సమీప గ్రామాల ప్రజలు వన్యప్రాణుల నుంచి జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో టైగర్ ప్రాజెక్ట్ ట్రైనింగ్ అధికారి శ్రీధర్, డీఆర్వో హైమావతి, సిబ్బంది ప్రతాప్, శ్రీను, పరమేశ్వరి పాల్గొన్నారు.

'తల్లికి వందనం' వర్తింపజేయాలి: సీఐటీయూ



బైకు ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

నంద్యాల రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీలలోని ఇంజనీరింగ్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని, ప్రతి మున్సిపల్ కార్మిక కుటుంబానికి 'తల్లికి వందనం' పథకాన్ని వర్తింపజేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. పట్టణంలో కార్మికులతో కలిసి బుధవారం బైక్ ర్యాలీ చేపట్టారు. లక్ష్మణ్ మాట్లాడుతూ కార్మికులందరికీ రూ.26 వేలు జీతం ఇవ్వాలని కోరారు. పదేళ్లు పనిచేసి విశ్రాంత కార్మికులకు రూ.75 వేలు రిటైర్‌మెంట్ బెనిఫిట్ కల్పించాలని, మృతి చెందిన కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా, కార్మిక కుటుంబానికి ఉద్యోగం కల్పించాలని కోరారు. రిటైర్‌మెంట్ వయస్సు 62ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా నాయకులు భాస్కరాచారి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, రంగనాథ్, సహాయ కార్యదర్శి బాలదుర్గన్న, కృష్ణయ్య ఆదాము తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై నిత్యం మురుగు

● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



కొత్తపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపురం మీదుగా కొలనుభారతి, సంగమేశ్వరానికి నిత్యం వందలాది మంది వెళ్లే ప్రధాన రహదారి ఇది. అయితే ఈ రహదారిపై నిత్యం 24 గంటలు మురుగునీరు ప్రవహిస్తుంది. ఈ రహదారిని స్వయంగా స్థానిక ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పరిశీలించి అధికారులకు మురుగునీరు రహదారి వెంట వెళ్లకుండా ఇరువైపులా కాలువలు నిర్మించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశిస్తున్నా అధికారుల్లో మాత్రం స్పందన కరువైందని ప్రజలు వాపోతున్నారు. నిత్యం ఈ రహదారి వెంట జిల్లా అధికారులు, మండల అధికారులు వెళ్తున్నారే గానీ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడం లేదని వాపోతున్నారు. అధికారుల అలసత్వమో, నిర్లక్ష్యమో.. నిధుల కొరత ఏమో తెలియదు కానీ, మురుగునీరు మాత్రం రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో ఎంతో మంది ద్విచక్ర వాహనదారులు బైక్‌లు అదుపుతప్పి గాయాలపాలైన ఘటనలు కూడా ఉన్నాయి. సంగమేశ్వరం, కొలనుభారతి వెళ్లే భక్తులే గాకుండా ఈ రహదారి గుండా 20 గ్రామాల ప్రజలు వివిధ పనుల నిమ్మితం ఆత్మకూరు పట్టణానికి వెళ్లి వస్తుంటారు. ఈ మురుగు కూడా గ్రామ నడిబొడ్డున ఉన్న ఓ బావి దగ్గర నుంచి ఈ నీరు ప్రధాన రహదారిపై ప్రవహిస్తోంది. అయితే స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. రహదారికి సైడు కాలువలు నిర్మిస్తే సమస్యలు పరిష్కారం అవుతుందని అధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోవడం లేదని ప్రజలు అంటున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి



లింగాపురం గ్రామ నడిబొడ్డున ప్రధాన రహదారిపై మురుగునీరు వెళ్లకుండా సైడు కాలువలు నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలి. ఎంతో మంది జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు ప్రజాప్రతినిధులు ఈ రహదారిపై వెళ్తున్నారే గానీ ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి.

● చిన్న పుల్లారెడ్డి, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు, లింగాపురం

వాటర్‌షెడ్ పనుల పరిశీలన



వివరాలను పరిశీలిస్తున్న నాబార్డు అధికారులు

గడివేముల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గని గ్రామంలో నాబార్, జేఎస్‌డబ్ల్యూ కంపెనీ ఆర్థిక సహకారంతో చేసిన వాటర్‌షెడ్ పనులను నాబార్డ్ డీడీఎం కార్తీక్ పరిశీలించారు. అనంతరం కమిటీ సభ్యులు, రైతులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ వాటర్‌షెడ్ ద్వార భూగర్భజలాలు పెరుగుతాయని అన్నారు. భూ సంరక్షణ పనులు చేపట్టడం వల్ల భూమి కోతను నివారించవచ్చని అన్నారు. నవ యువత అసోసియేషన్ డైరెక్టర్ నరసింహులు, ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మీనారాయణ, ఇంజనీర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

నందికొట్కూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ వినోద్‌మిశ్రా భవన్‌లో బుధవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇళ్లులేని నిరుపేదలందరికీ పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు గృహాలకు ఐదు లక్షలు మంజూరు చేస్తామని ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా నాయకులు సుధాకర్, సోమన్న, బీబీ, లక్ష్మీదేవి, ముర్తుజాబీ, చెంచమ్మ, నాగమణి, శివకుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

ఆత్మకూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఐ నాయకులు బాబాఫకృద్దీన్, సోమన్న, ప్రతాప్ డిమాండ్ చేశారు. ఆపార్టీ శత వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా పట్టణ, మండల మహాసభలను పురస్కరించుకుని పట్టణంలో ర్యాలీ నిర్వహించి గౌడ్‌సెంటర్ వద్ద గౌడు సెంటర్‌లో జెండా ఎగుర వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వందేళ్ల సీపీఐ ప్రస్థానంలలో ప్రజల పక్షాన అనేక పోరాటాలు చేసినట్లు గుర్తుచేశారు. ఆ పార్టీ నాయకులు చాంద్‌బాషా, లల్లు, అతావుల్లా తదతరులు ఉన్నారు.

పని గంటలు పెంచడం సరికాదు

నంద్యాల రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు పని గంటలను పెంచాలని ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను వ్యతిరేకిస్తున్నామని, ఇది సరికాదని, దీనిని నిరసిస్తూ జూలై 20న ఆందోళన కార్యక్రమం చేపడుతున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కార్పొరేట్ కబంధ హస్తాలలోకి వెళ్తోందని ఆరోపించారు. అనేక మంది ప్రాణ త్యాగాలు, పోరాటాల వల్ల సాధించుకున్న 8 గంటల పనిదినాన్ని 10 గంటలకు పెంచాలని తీసుకుంటున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, ఆటో యూనియన్ నాయకులు శ్రీను, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా శ్రీదేవి

మిడుతూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మిడుతూరులోని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా బీటీ శ్రీదేవి బుధవారం బాధ్యతలు చేపట్టారు. తిరుపతిలో విధులు నిర్వహిస్తూ మిడుతూరుకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న సలీం బాషా విజయవాడకు బదిలీపై వెళ్లారు.

యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలి: ఆర్డీవో

ఆత్మకూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 21వ తేదిన 11వ ప్రపంచ యోగా దినోత్సవ వేడుకల్లో ఆత్మకూరు డివిజన్‌లోని అధికారులు అందరూ తమ సిబ్బందితో పాటు ప్రజలతో కలిసి విజయవంతం చేయాలని ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి పిలుపునిచ్చారు. బుధవారం ఆమె మాట్లాడుతూ యోగా కార్యక్రమం గురించి ప్రజల్లో విస్తృతమైన ప్రచారం చేయాలని అన్నారు. ప్రజల భాగస్వామ్యం ఉండేలా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఆత్మకూరు, నందికొట్కూరు నియోజకవర్గాల పరిధిలో జూన్ 21వ తేదిన యోగాంధ్ర కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు పాల్గొనేలా ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. డివిజన్ పరిధిలో జరిగే యోగాంధ్ర కార్యక్రమాన్ని అధికారులు, ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

అర్హులందరికీ పథకాలు అందించాలి



'వెన్నుపోటు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైసీపీ నాయకులు

వెలుగోడు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు అందించాలని వైసీపీ నాయకులు అంబాల ప్రభాకరరెడ్డి, తిరుపెడ్డి, ఇలియాస్, వెలుగోడు సర్పంచ్ జయపాల్ డిమాండ్ చేశారు. వెలుగోడులోని వైసీపీ కార్యాలయంలో బుధవారం 'వెన్నుపోటు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన కొనసాగుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన ఇచ్చిన హామీలను నేరవేర్చలేదని ఆరోపించారు. కార్యక్రమంలో షంషీర్, ఏసురత్నం, గోవింద్, వలి, శంకర్‌నాయక్, రమణ, నాగేశ్వరరెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కంట పడితే.. వెంట పడతాయి

● కుక్కల స్వైర విహారంతో భయాందోళనలో ప్రజలు



గడివేములలో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

గడివేముల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను, వాహనదారులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. బిలకలగూడురు, గడివేముల, మంచాలకట్ట, చిందుకూరు, గడిగరేవుల, తిరుపాడు గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఇటీవల బిలకలగూడురు గ్రామంలో గొర్రె పిల్లల మందపై దాడి చేయగా 22 గొర్రె పిల్లలు మృతి చెందగా 15 గొర్రె పిల్లలు కుక్క కాటుకు గురయ్యాయి. కుక్కలు గుంపులు గుంపులుగా రోడ్లపై తిరుగుతూ చిన్నా పిల్లలు, ద్విచక్ర వాహనదారులను వెంబడించి పరుగు పెట్టిస్తున్నాయి. కుక్కల బెడదను నియంత్రించాలని గత సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీ, సర్పంచ్‌లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన కుక్కల బెడద నియంత్రణపై అధికారులు చర్యలు తీసుకోలేదు.

వీధి కుక్కల దాడుల నియంత్రణకు చర్యలు

కుక్కల బెడదను తప్పించేందుకు చర్యలు తీసుకుంటాం. కుక్కలు అధికంగా ఉన్న పంచాయతీలను గుర్తించి వాటి సంతానోత్పత్తిని నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటాం.

● వాసుదేవగుప్తా, ఎంపీడీవో

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి శైలజ

ఆళ్లగడ్డ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డలో జూలై 5న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి శైలజ తెలిపారు. బుధవారం స్థానిక న్యాయ సేవా సంఘం కార్యలయంలో పోలీసు అధికారు లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయా ధికారి మా ట్లాడుతూ పరిష్కారం కాని కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. కేసుల పరిష్కారంలో పోలీసు శాఖ అధికారులు కక్షిదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వ హించా లని తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ న్యాయాధికారి భాస్కర్, పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం

● ఎంపీపీ సహా మరో ముగ్గురు ఎంపీటీసీలు హాజరు

రుద్రవరం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం మొక్కు బడిగా సాగింది. బుధవారం ఎంపీపీ బాలస్వామి అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఎంపీటీసీ, కో ఆప్షన్ మెంబరు గౌరవవేతనం అందలేదని వెనుదిరిగి వెళ్లారు. ఎంపీపీ సహా మరో ముగ్గురు ఎంపీటీసీలు సమావేశానికి హాజ రయ్యారు. 10.30గంటలకు సమావేశం ప్రారంభం కావాల్సి ఉండగా 11.59గంటలకు సమావేశం ప్రారంభమైంది. 1.10కి ముగి సింది. ఆయా శాఖ అధికారులు ప్రగతి నివేదికలను చదివివినిపిం చారు. సమావేశంలో ఎంపీడీవో భాగ్యలక్ష్మి, ఇన్‌చార్జ్ ఎంఈవో వీర రాఘవయ్య, ఏవో సుమతి, పశువైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రమణ్యం, ఎంపీటీసీలు ఆలమూరు మీరాంబీ, పెద్దకంబలూరు రాణెమ్మ, యల్లావత్తుల పెద్దకాశన్న పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి స్థలాల పరిశీలన

చాగలమర్రి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో స్వచ్ఛ భారత్ మిషన్ కింద సామూహిక మరుగుదొడ్లు నిర్మించనున్నట్లు ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగ్గయ్యతో కలిసి ఎంపీడీవో చాగలమర్రి గ్రామంలో పలుచోట్ల సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 20 ప్రాం తాల్లో రూ.60 లక్షలతో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలు చేపడు తున్నట్లు తెలిపారు. చాగలమర్రిలో ఎనిమిది, ముత్యాల పాడు, మద్దూరు, చిన్నబోధనం, గొట్లూరు గ్రామాల్లో ఆరు, పెద్దవంగలి, చిన్నవంగలి, పెద్దబోధనం, తోడెండ్లపల్లె, నేలంపాడు గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున నిర్మిస్తామని ఆయన వివరించారు.

బాధితులకు ఆర్థిక సాయం

బనగానపల్లె, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణం లోని స్థానిక ఆర్యవైశ్య భవనంలో టంగుటూరు శ్రీనయ్య సహకా రంతో వసుధా ఫౌండేషన్ సహకారంతో ఎనిమిదిమందికి రూ.50 వేలు విలువగల చెక్కులను బుధవారం తహసీల్దారు నారా యణ రెడ్డి, టీడీపీ నాయకుడు, హైకోర్టు లాయర్ అల్లీహుసేన్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్య క్షుడు గాథంశెట్టి వేణుగోపాల్, పీఎస్ఎస్ నారాయణ, శ్రీరామ వెం కట సుబ్రమణ్యం, భరతుడు, గుండారవికుమార్, ఫణి, జంగంశెట్టి, టీచ ర్ నాగరాజు, ఖాదర్, లాయర్ నాగేంద్రారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ

బనగానపల్లె, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండల పరిషత్ ఉర్దూ బాలికల ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం నూర్ మొహిద్దీన్ ఆధ్వర్యంలో సర్వేపల్లె రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను పట్టణ టీడీపీ మైనార్టీ నాయకులు ఉపసర్పంచ్ బురానుద్దీన్, అల్తాఫ్‌హుసేన్, నియాజ్ హుసేన్ పంపిణీ చేశారు. ఖాజీ వాడా మసీదు ఇమాం, మహ్మద్‌మియా ఉర్దూ ఔన్నత్యాన్ని వివరించారు.కార్యక్రమంలో కాశీంబాష, పూలకలాం పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

బేతంచెర్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్, బాలల సంరక్షణ విభాగం జిల్లా అధికారి శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో బాల్య వివాహాల నిర్మూలనపై సమన్వయ సమావేశాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధమ్మ, తిప్పమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిప్రసాద్ మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 సంవత్సరాలు, మగ పిల్లలకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహాలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ మేనేజర్ సువర్ణలక్ష్మి, సిబ్బంది రాజు, తేజ, మధు, మెప్మా కన్వీనర్ సూర్యనారాయణ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నాణ్యత ఏదీ?

- బాలుర హాస్టల్ భవనం మరమ్మతులకు రూ. 22లక్షలు మంజూరు
- తూతూ మంత్రంగా చేపట్టిన పనులు
- రెండు నెలలకే రాలిపోయిన పెయింటింగ్
- వేలాడుతున్న ట్యూబ్‌లైట్లు

అవుకు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులు విద్యకు దూరం కావద్దన్న ఉద్దేశంతో ప్రభుత్వాలు హాస్టళ్లను ఏర్పాటు చేసి ప్రోత్సహిస్తున్నా యి. అయితే కొందరు అధికారుల పనితీరుతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది. పట్టణంలో బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని రూ. 1.68 కోట్లతో నిర్మించి 2012 ఆగస్టు నెల 22న ప్రారంభించారు. ఈ హాస్టల్‌లో 3నుంచి 10వ తరగతి వరకు 75మంది విద్యార్థులు విద్యను అభ్యసి స్తుంటారు. దాదాపు 13 ఏళ్లుగా మరమ్మతుల కోసం ఎలాంటి నిధులు మంజూరు కానప్పటికీ ఉన్న వసతులతోనే విద్యార్థులు కాలం వెల్లదీస్తూ వచ్చారు. హాస్టల్ విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ఈఏడాది ఫిబ్రవరి నెలలో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ నుంచి భవనం మరమ్మతులు, కనీస వసతుల కోసం రూ. 22లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో గతంలో ఉన్న 20 స్నానపు గదులు, 20 మరుగుదొడ్లకు దెబ్బతిన్న తలుపులు, చౌకట్లు, పైపులైన్, కొళాయిలు, గదుల్లో ఫ్యాన్‌లు, ట్యూబ్‌లైట్లు, భవనం మధ్యలో లోపలి ఖాళీ స్థలంలో నాపరాయితో బండసపట, బోరింగ్, భవనానికి పెయింటింగ్, డ్రైనేజీ పైపులైన్, మినరల్ వాటర్‌ప్లాంట్, దెబ్బతిన్న డోర్‌లు, సింటెక్‌ట్యాంక్ ఏర్పాటు చేయాల్సి ఉంది.

మంజూరు అయిన నిధులతో పొంతన లేని పనులు

భవనానికి వేసిన పెయింట్‌లో పౌడర్ కలిపి వేయటంతో కేవలం రెండు నెలలకే పెయింటింగ్ రాలిపోతుంది. ట్యూబ్ లైట్లు వేలాడుతున్నాయి. వంటగది, వార్డెన్ గదితో పాటు విద్యార్థుల మూడు గదుల వాకిళ్లు దెబ్బతిన్నా పట్టించు కోలేదు. మరుగుదొడ్ల పైపులైన్ కోసం తవ్విన కాలువను పూడ్చకుం డానే వదిలేశారు. గతంలో హాస్టల్‌కు చెందిన పాత ఆరువేల లీటర్ల నీటి నిల్వ గల సింటెక్‌ట్యాంకునే బిగించారు. సింటెక్ చుట్టూ రక్షణ గోడను నిర్మించలేదు. మినరల్ వాటర్ ప్లాంటు మరమ్మతులు చేయకుండానే వదిలేశారు. తాగునీటి పైపులైన్ లీకేజీ అవుతున్న పట్టించుకోలేదు. మంజూరైన నిధులకు, నాణ్యత లేని పనులకు పొంతనే లేదని విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. హాస్టల్ భవనంలో చేసిన పనులను ఉన్నతాధికారులు పరిశీలించి సమగ్ర విచారణ జరుపాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



రెండు నెలలకే రాలిపోతున్న పెయింట్



విద్యార్థుల గది తలుపుల దుస్థితి



స్నానపు గదుల్లో అమర్చిన నాణ్యత లేని వాకిలి చౌకట్‌లు

పనులపై ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ అసంతృప్తి

గత నెల 17న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మనోహర్, బనగానపల్లె ఏడీ మధుసూధన్, అవుకు, కొలిమిగుండ్ల ఏఈలు కిరణ్‌బాబు, కరిముల్లతో కలిసి పరిశీలించారు. స్నానపు గదులకు బిగించిన చౌకట్లు, భవనానికి వేసిన పెయింట్ తదితర పనుల్లో నాణ్యత కొరవడినట్లు గుర్తించి తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. అనవసరంగా నిధులు దుర్వినియోగం చేయటంపై అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం.

నిధుల మేరకు పనులు చేశాం

ప్రభుత్వం విడుదల చేసిన నిధుల మేరకు హాస్టల్ భవనంలో పనులు పూర్తి చేశాం. భవనానికి వేసిన పెయింట్‌లో పౌడరు కలిపిన మాట వాస్తవమే. మినరల్ వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేపడతాం. పంచాయతీ అధికారులతో చర్చించి తాగునీటి కోసం కొత్త పైపులైన్ వేస్తాం.

- కిరణ్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, అవుకు

వాటర్‌ప్లాంటుకు మరమ్మతులు చేయాల్సింది



మినరల్ వాటర్ ప్లాంట్ ఐదేళ్ల క్రితం మరమ్మతులకు గురైంది. ప్రస్తు తం మం జూరైన నిధులతో కొత్త మినరల్ ప్లాంటు ఏర్పాటు చేయొచ్చు. ఉన్న ప్లాంట్‌ను కనీసం మరమ్మతులైనా చేయాల్సింది. దీని విడిచిపెట్టి బోరింగ్‌కు మరమ్మతులు చేశారు. దీనికి వెచ్చించిన డబ్బులతో తాగు నీటి పైపులైన్ అయినా ఏర్పాటు చేసి ఉంటే బాగుండేది.

- యశ్వంత్‌నాయక్, హాస్టల్ విద్యార్థి

నాసిరకం పనులు చేశారు



హాస్టల్ భవనంలో మరమ్మతులు నాసిర కంగా చేశారు. వంటగది, వార్డెన్‌గది, వి ద్యార్థుల ఉండే మూడు గదుల తలుపులు దెబ్బతిన్నాయి. పెయింట్ రాలిపోతోంది. గోడలకు ఎక్కడ ఆనుకున్నా బట్టలకు రంగు అవుతోంది. హాస్టల్‌కు తాగునీటి కోసం కొత్త పైపులైన్ ఏర్పాటు చేయాలి.

- మధుశేఖర్, హాస్టల్ విద్యార్థి

అన్యాక్రాంతమైన వక్ఫ్‌బోర్డు భూములపై విచారణ

చాగలమర్రి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో అన్యాక్రాంతమైన వక్ఫ్‌బోర్డు స్థలాలు, పంట పొలాలపై విచారణ చేపట్టినట్లు జిల్లా వక్ఫ్‌బోర్డ్ ఇన్‌స్పెక్టర్ ఇమ్రాన్ తెలిపారు. బుధవారం చాగలమర్రి గ్రామంలోని భవానినగర్, కూలూరు, మల్లేవేముల రహదారుల్లోగల ఇళ్ల స్థలాలు, భూములను పరిశీలించారు. మండల సర్వేయర్ మద్దిలేటి ద్వారా వక్ఫ్‌బోర్డ్ ఆస్తుల సరిహద్దులను గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 200ఎకరాల వక్ఫ్ బోర్డ్ ఆస్తులు ఉన్నాయన్నారు. ఈ ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయని ఫిర్యాదులు రావడంతో పరిశీలిస్తున్నామని తెలిపారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి నివేదికలను కలెక్టర్‌కు అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ తాహిర్‌హుసేన్, వక్ఫ్‌బోర్డ్ ఆడిటర్ జాకిర్, వీఆర్వోలు పాల్గొన్నారు.



చాగలమర్రిలో స్థలాలను పరిశీలిస్తున్న జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఇమ్రాన్

అలసత్వం వీడాలి : ఎంపీపీ

అవుకు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న అధికారులు విధుల పట్ల అలసత్వం వీడాలని అవుకు మండల అధ్యక్షుడు చల్లా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వెంగన్న ఆధ్వర్యంలో మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సమావేశానికి అధికారులు గైర్హాజరు కావటం మంచి పద్ధతి కాదన్నారు. అధికారులు ప్రవర్తిస్తున్న తీరుపట్ల ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని అన్నారు. పలువురు అధికారులు ప్రగతి నివేదికను చదివివినిపించారు. డాక్టర్ అభినయ్ మాట్లాడుతూ చాలా మంది గుండెపోటు బారిన పడుతుండటంతో ప్రభుత్వం అవుకు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వం గుండెకు భరోసా కింద రూ. 60 వేలు విలువ గల ఇంజక్షన్‌ను ఉచితంగా అందుబాటులో ఉంచిందన్నారు. గుండెపోటుకు గురైన వ్యక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ రామప్ప, తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, డాక్టర్ నవీన్, ఎస్సార్బీసీ డీఈ మల్లికార్జున, ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, ఏవో శ్రీరామ్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ప్రకాష్‌రావు, ఎంఈవో శ్రీధర్‌రావు, హౌసింగ్ ఏఈ కృష్ణారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిరణ్‌బాబు, పంచాయతీరాజ్ ఇన్‌చార్జి ఏఈ సుబ్రమణ్యం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పావని, శివమ్మ, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ అభినయ్

ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి



డీఈవోకు వినతి పత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

బేతంచెర్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అమ్ముతూ ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ విద్యార్థి యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డికి పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సూర్యప్రతాప్, శశిధర్ రెడ్డి, చందు, ధనుష్, అస్లాం మాట్లాడుతూ పట్టణంలో ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు స్పందించిన డీఈవో మాట్లాడుతూ పట్టణంలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలు, బూట్లు, టైబెల్టుల పేరుతో తల్లిదండ్రుల నుంచి ఆర్థిక దోపిడీ చేస్తున్న పాఠశాలకు నోటీసులు జారీ చేశామని తెలిపారు. విద్యార్థి సంఘాల నాయకుల ఫిర్యాదు మేరకు నోటీసులు జారీ చేశామని ఎంఈవో సోమశేఖర్ తెలిపారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి

డోన్ టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈ నెల 21న ఉదయం 6 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డోన్ పురపాలక సంఘం కార్యాలయం నుంచి పాతబస్టాండు గాంధీ సర్కిల్, రైల్వేస్టేషన్ రోడ్డు వద్ద ర్యాలీ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని ప్రభుత్వ కార్యాలయ ఉద్యోగులు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

డోన్ టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20, 21 తేదీల్లో జరిగే సీపీఐ ప్రజానాట్యమండలి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి నారాయణ తెలిపారు. బుధవారం మండలంలోని నక్కి రామన్న భవన్‌లో మండల కార్యదర్శి నారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ నాయకులు కోయలకొండ నాగరాజు, మధు, లక్ష్మీదేవమ్మ పాల్గొని మాట్లాడారు. జిల్లా నలుమూలల నుంచి కళాకారులు అందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు.

దేవాలయ భూములకు కౌలు వేలం

రుద్రవరం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలూరు గ్రామంలో చెన్న కేశవస్వామి ఈశ్వరస్వామి దేవాలయ భూములకు కౌలు వేలం దేవాదాయ శాఖ అధికారులు బుధవారం నిర్వహించారు. కౌలుదారులు వేలంలో పోటాపోటీగా పాడడంతో రూ.6.27లక్షలు ఆదాయం వచ్చిందని ఈవో నరసయ్య తెలిపారు. ఈ ఆదాయాన్ని దేవాదాయఖాతాలో జమ చేస్తామన్నారు. కార్యక్రమంల ఈవో సాయి జయచంద్రారెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు లైసెన్సు కలిగి ఉండాలి

కోవెలకుంట్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని ముదివేడు రహదారిలో వాహనాల తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. లైసెన్సులు. సర్టిఫికెట్లు లేని వాహ నాలకు జరిమానాలు విధించారు. ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలను నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలి

ఆళ్లగడ్డ, జూన్ 18(ఆంధ్ర జ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహిం చాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి లీలావతి తెలిపారు. అహోబిలంలో నిర్వహిస్తున్న 1, 2 అంగన్ వాడీ సెంటర్‌లను సూపర్‌వైజర్ పార్వతితో కలిసి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పౌష్టికాహారం, పిల్లల హాజరును పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చేరే పిల్లలకు ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న పీడీ

పండ్ల తోటల సాగుకు ప్రోత్సహించాలి

చాగలమర్రి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పండ్లతోటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని ఉపాధి ఏపీవో ఖాసీంసాహెబ్ సూచించారు. బుధవారం కేపీ తండా గ్రామంలో కంపోస్టు ఎరువు తయారీ కోసం చేపట్టిన ఇంకుడు గుంతల పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తాచెదారాన్ని కంపోస్టు ఎరువు తయారు చేసేందుకు గుంతలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మండలంలో 260 పండ్ల తోటల సాగుకు లక్ష్యంగా ఉందని అన్నారు. ఇప్పటి వరకు 50 ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేయుటకు రైతులు ముందుకు వచ్చారని తెలిపారు. ప్రస్తుతం 700 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

హెచ్‌ఎంలకు మెటీరియల్ పంపిణీ

చాగలమర్రి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబోధనం, చాగలమర్రి, చింతలచెరువు స్కూల్‌కాంప్లెక్స్‌లకు మంజూరైన మెటీరియల్‌ను హెచ్‌ఎంలకు బుధవారం ఎంఈవో అనూరాధ అందజేశారు. కాంప్లెక్స్ సమావేశాల్లో మెటీరియల్‌ను ఉపాధ్యాయులు వినియోగించుకునేందుకు వీలుపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో న్యామతుల్ల, హెచ్‌ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

చాగలమర్రి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఐదు సంవత్సరాలు దాటిన పిల్లల ఆధార్ అప్‌డేట్ తప్పనిసరిగా చేయించాలని తల్లిదండ్రులను ఎంఈవో న్యామతుల్ల సూచించారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం పథకం సంబంధించి 22మంది విద్యార్థులకు ఆధార్ అప్‌డేట్ లేకపోవడంతో తిరిగి అప్‌డేట్ చేస్తున్నామని అన్నారు. మండలంలోని పెద్దవంగలి ఎస్సీ కాలనీలో ఇద్దరు విద్యార్థులు, ఒకే ఉపాధ్యాయుడు కథనానికి డీఈవో స్పందించి విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు ఎంఈవో పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి బలోపేతం చేయాలని కోరారు.

పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు

శిరివెళ్ల, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలను కూటమి ప్రభుత్వం అందిస్తోందని టీడీపీ నాయకులు నంద్యాల అబూబకర్ సిద్ధిఖ్, యూనుస్ బాషా, అనీస్‌ఖాన్ అన్నారు. శిరివెళ్లలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యార్థిమిత్ర కిట్లను వారు బుధవారం పంపిణీ చేశారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని వారి పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోవిందరాజులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మూడో రోజుకు చేరిన కార్మికుల దీక్షలు

డోన్ టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె బుధవారం మూడో రోజుకు చేరింది. వీరి దీక్షకు బీసీ జాతీయ సంక్షేమ సంఘం నాయకుడు ఏఈ నాగరాజు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్మికులు మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చకపోతే ఈ నెల 22 అర్ధరాత్రి నుంచి మెరుపు సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గౌస్, చంద్ర, రవికుమార్, ఇస్మాయిల్, అజయ్, ఈశ్వరమ్మ, అరుణ, రంగ, మల్లేష్, స్టీఫెన్‌సన్, రాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ'పై ఆందోళన చెందొద్దు

ప్యాపిలి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'అన్నదాత సుఖీభవ' పథకంపై రైతులు ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయ అధికారి రాజేష్ సూచించారు. బుధవారం ఆయన స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మాట్లాడుతూ ఈకేవైసీ కోసం రైతులు రైతు సేవా కేంద్రాలకు రావద్దని సూచించారు. మండలంలోని రైతులందరి ఈకేవైసీ పూర్తి చేశామన్నారు. రైతులు పనులను వదిలి ఈకేవైసీ కోసం రావద్దని సూచించారు. ఈ నెల 21న అన్నదాత సుఖీభవ నిధులు రైతుల ఖాతాలో జమకానున్నట్లు తెలిపారు.

'తల్లికి వందనం' జాబితాను సరి చేస్తున్నాం

ప్యాపిలి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): 'తల్లికి వందనం' జాబితాను సరి చేస్తున్నామని మండల విద్యాధికారి వెంకటేశ్‌నాయక్ తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ సాంకేతిక కారణాల వలన తల్లికి వందనం జాబితాలో తప్పులు దొర్లాయన్నారు. దీంతో కొంత మంది తల్లుల ఖాతాలో నిధులు జమ కాలేదన్నారు. జాబితాను సరిచేసి ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. ఈ నెల 26న పెండింగ్‌లో ఉన్న తల్లులందరికి డబ్బులు జమవుతాయని ఎంఈవో తెలిపారు.

ఈవ్‌టీజింగ్‌పై పాల్పడితే చర్యలు : సీఐ

కొలిమిగుండ్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : అమ్మాయిలతో అసభ్యంగా ప్రవర్తించినా, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా కఠినచర్యలు చేపడతామని సీఐ మద్దినేని రమేష్‌బాబు హెచ్చరించారు. కాలేజీలు, పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో బుధవారం మండల కేంద్రమైన మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు, అధ్యాపకులకు ప్రత్యేక జాగ్రత్తలు తెలియజేస్తూ అవగాహన కల్పించారు. అనంతరం ప్రధాన హోటళ్లు, దుకాణాల వద్ద యువకులతో కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఉద్యోగుల బదిలీలపై నిబంధనలు తగదు

కొలిమిగుండ్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ ఉద్యోగుల బదిలీలపై ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకురావవం తగదని సచివాలయ ఉద్యోగులు పేర్కొన్నారు. బుధవారం జీవో నంబర్-5 రద్దు చేయాలని ఎంపీడీవో ప్రసాదరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. సొంత మండలంలో పని చేయకూడదు అన్న నిబంధనతో ఉద్యోగులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాపోయారు. ప్రభుత్వం ఈనిబంధనలను సడలించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మండల టాపర్‌కు నగదు అందజేత



నగదు సత్కారం అందుకుంటున్న విద్యార్థి కళ్యాణ్‌బాబు

కొలిమిగుండ్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పది ఫలితాల్లో 581 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన కళ్యాణ్‌బాబు విద్యార్థికి రూ.50వేల నగదు మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి బుధవారం అందజేశారు. దీంతో విద్యార్థి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తంచేశారు. మండల టాపర్‌గా నిలిచిన కళ్యాణ్‌బాబును ఎంఈవో అబ్దుల్‌కలాంతో పాటు, మోడల్‌స్కూల్ అధ్యాపకులు, పలువురు పెద్దలు అభినందించారు.

సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

●17వ రోజుకు చేరిన సిమెంటు ఫ్యాక్టరీ కార్మికుల దీక్షలు

బేతంచెర్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సిమెంటునగర్‌లో ఉన్న పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీ యాజమాన్యం కార్మికుల న్యాయమైన సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఈ నిరసన దీక్షలు బుధవారం 17వ రోజుకు చేరాయి. కార్మికుల దీక్షలకు సిమెంటునగర్ టీడీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. గణపతిరెడ్డి, రామారావు, మాట్లాడుతూ ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా అవగాహన లేనటువంటి ఎన్‌సీఎల్‌టీ వారికి అప్పజెప్పడం ద్వారా పరిశ్రమకు కష్టాలు వచ్చాయన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని కార్మికులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో మోజెస్ రామసుబ్బయ్య, రామాంజనేయులు, శ్రీనివాసులు, చంద్రశేఖర్, వి.మద్దయ్య, అత్తార్‌బాషా, లోడ్ ధరెడ్డి, రంగన్న, ఆంజనేయులు ఉన్నారు.